# ఒక దెయ్యం ఆత్మకథ

**(మనిషి పాత్రలేని నవల)**

**అంకితం**

నా అర్ధాంగి నా ప్రాణం చి|| ప్రమీలకు ఈ నవల అంకితం.



**అనేకానేక సీతాకోక చిలకల రెక్కల మీద ఒక ప్రముఖ దెయ్యం రాసుకున్న ఆత్మకథ ఇది. ఆ దెయ్యం దీన్ని పిశాచి భాషలో రాసిందని నా అభిప్రాయం. పిశాచుల భాష నాకు పిసరంతయినా రాకపోయినప్పటికీ, అర్థం కాకపోయినప్పటికీ తర్జుమా కళ మీద నాకున్న మమకారం కొద్దీ నేను దీన్ని చాలా సాహసవంతంగా అనువదించాను. అనువాదానికీ, మూలానికీ సంబంధం వుండక్కరలేదన్న మూల సూత్రాన్ని నేను పాటించినందు వల్ల ఎక్కడైనా కొంత స్వేచ్ఛ తీసుకుని వుండవచ్చు. అందు గురించి ఎవరూ, ఏమీ అనుకోరని ఆశిస్తాను.**

**– రచయిత**

నా గురించి నేను మొట్టమొదట చెప్పుకోవలసింది ఏమంటే, నాకు దెయ్యాల మీద నమ్మకం లేకపోవడం. దెయ్యాలు లేవని నాకు తెలుసు. బాగా చిన్నప్పుడే నేను బేడపెట్టి ఒక పుస్తకం కొని చదివాను. అది చదివిన వెంటనే నాకు దెయ్యాలు లేవనే విషయం తెలిసిపోయింది.

అప్పట్నించి ఇప్పటివరకు నా జీవితంలో దెయ్యాలు లేవనే విషయం మీద దెయ్యాలతో వాదించడంతోనే గడిచిపోయింది. నేను సత్యం, నేను తప్ప మిగిలినదంతా మిథ్య – అనే సత్యం నాకు చాలా కాలం వరకు తెలియలేదు గానీ, తెలిసి చాలా కాలం అయిపోయింది.

ఏనాడైతే నేను తప్ప వేరేదీ లేదని నాకు స్పష్టంగా తెలిసిపోయిందో ఆనాడే నేను నా చిన్న నాటి పుస్తకంలో చదివిన విషయం ఎంత గొప్పదో పోల్చుకున్నాను.

దెయ్యాలనేవి లేనే లేవని నేను కొన్ని లక్షల దెయ్యాలకు చెప్పిచూశాను.

బేడ పెట్టి కొన్న పుస్తకం చూపించి, అందులోని విషయాలు చదివి వినిపించినా అవి వినలేదు. నా మాట నమ్మలేదు.

పైగా నన్నూ, నా జ్ఞానాన్ని కించపరచాలని చూశాయి. నన్ను వెక్కిరించడానికి ప్రయత్నించాయి.

నన్ను వెలేసినంత పని చేశాయి. కానీ రాజుగారి బిడ్డను కాబట్టి భయపడి వూరుకున్నాయి.

నా జ్ఞానం గొప్పదైనప్పటికీ పదిమందితో కలిసి బతకవలసివున్నది కాబట్టి, రాజుగారి బిడ్డను కాబట్టి కాలక్రమేణా లౌక్యాన్ని అవలంభించి దెయ్యాలు వున్నట్టు, వాటి ఉనికిని నేను గుర్తించినట్టు నటించడం మొదలు పెట్టాను.

ఎప్పుడయితే నేను యీ రకమైన లౌక్యాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టేనో మిగిలిన దెయ్యాలు నన్ను కొంత అభిమానంగా చూసుకోవడం మొదలు పెట్టాయి.

దానికి తోడు నేను శ్రీ ఆంజనేయస్వామి వరాన పుట్టిన దెయ్యాన్ని కావడంచేత మరింత గౌరవం లభించింది. అవతలివాడు ఎంతవాడయినా నా చాటునే నన్ను తిట్టాలి తప్పించి నా మొహంమీద నన్ను దూషించే ధైర్యం ఎవరికీ వుండేది కాదు.

## 2

నాకు జ్ఞానం వచ్చేనాటికి మా దెయ్యాల్లో జుత్తు దెయ్యాలు, గుండు దెయ్యాలు అని రెండే రకాలు దెయ్యాలుండేవి.

నేను పెరిగి పెద్దయిన తర్వాత మరో రెండు రకాల దెయ్యాలు ఉన్నట్టు నేనే కనిపెట్టాను. జుత్తు దెయ్యాలు, గుండు దెయ్యాలతో పాటు బుర్ర లేని దెయ్యాలు, బుర్రున్న దెయ్యాలు అని మరో రెండు రకాలు ఉన్నట్టు కనిపెట్టాను.

మరి కొంత కాలానికి మరో మూడు రకాల దెయ్యాలున్నట్టు వర్గీకరించగలిగాను. జుత్తుండీ బుర్రలేని దెయ్యాలు, జుత్తుగానీ, బుర్రగానీ లేని దెయ్యాలు, బుర్రవున్న గుండు దెయ్యాలు.

ఇంతవరకూ రాసి, నేను ఏదో పనిమీద బయటికి వెళ్ళొచ్చేసరికి మా మేనమామ దాన్ని చదువుతూ కనిపించాడు.

నన్ను చూసిన వెంటనే దగ్గరకు రమ్మని పిల్చి నా చెవి పట్టుకున్నాడు.

'ఏవిటీ పిచ్చిరాత?' అన్నాడు.

'ఇలాగా రాయడం?' అన్నాడు.

ఉన్నది వున్నట్టు, జరిగింది జరిగినట్టు రాయడానికి లోకంలో సవాలక్షమంది గాడిద కొడుకులున్నారన్నాడు.

"నీ ఆత్మకథలో నీ గురించి రాసుకుంటావా." అని వెక్కిరింతగా నవ్వేడు.

"జరిగింది జరిగినట్టు రాసుకుంటావా." అని కూడా నవ్వేడు.

దానితో నాకు కొంచెం కోపం వచ్చింది. ఉక్రోషం కలిగింది.

"నా యిష్టమొచ్చినది నేను రాసుకునే హక్కు నాకులేదా?" అని పెంకిగా అడిగాను.

"నీకే కాదు, లోకంలో ఎవరికీ అటువంటి హక్కు లేదు. నేను ఇంకొకడికి ఇష్టమైనది రాయాలి. నువ్వు నాకు యిష్టమైనది రాయాలి. అదేరూలు" అని మా మేనమామ ఖచ్చితంగా చెప్పేడు.

"ఇతరుల కోసం తన కళా కౌశలాన్ని వ్యర్థం చేసి, ఎందుకూ పనికి రాకుండా పోయిన ఆ చిలుక కథ నువ్వు వినలేదా" అని నేను అడిగేసరికి మా మేనమామ తెల్ల మొగం వేసుకొని

"అలాగ కూడా జరుగుతుందా" అని ఆశ్చర్యపోయాడు. అప్పుడు నేనీ కథ చెప్పాల్సి వచ్చింది.

## పలుకు చిలుక కథ

పూర్వం గోలుగొండ అడవుల్లో ఓ వయసొచ్చిన చిలుక వుండేది. అది చాలా అందంగాను, మంచిగాను వుండేది. దాని అందానికీ, మంచితనానికీ వనదేవత సంతోషించి ఓ తెల్లవారుజామున ప్రత్యక్షం అయింది. 'ఓ చిలుకా! నీవు ఎంతోచక్కగా వున్నావు. నిన్ను చూసి నాకు సంతోషం కలిగింది. నీకేం కావాలో కోరుకో" అన్నది.

చిలుక దానికి ఎంతో ఆనందించింది. వనదేవత చుట్టూ నూటొక్క ప్రదక్షిణలు చేసి ఆవిడ్ని మరింత సంతోషపెట్టి...

"ఓ వనదేవతా! నీ ఆదరణకు కృతజ్ఞురాలిని. నన్ను మించిన పలుకు చిలక యింకోటి లేకుండా చూడు నాకు అంతే చాలు' అని అడిగింది.

ఆ దేవత 'తథాస్తు' అనేసి మాయం అయిపోయింది.

పలుకు చిలుక జీవితం ఆ క్షణం నుండి మారిపోయింది.

అది పులిలాగా గాండ్రించడం నేర్చుకుంది. అడవి గాడిదలాగా ఓండ్రించి చూసింది. కోయిల వలె పలుక నేర్చింది. గుర్రంవలె సకిలించేది. కొండ మేకలాగా అరవడం నేర్చుకుంది.

అడవిలోని సమస్త శబ్దాలనూ అది అవలీలగా అనుకరించడం నేర్చుకుంది.

కొన్ని రోజులపాటు మిగిలిన చిలకలన్నీ దానిని చాలా పొగిడాయి. పలుకు చిలక ఒళ్ళు మరచిపోయింది. ఇరవైనాలుగు గంటలూ అది చిలుక వలె తప్ప మిగిలిన అన్ని పక్షులవలె, జంతువుల వలె పలకడం మొదలుపెట్టింది.

చూసి, చూసి ఓ రోజున ముసలి చిలుకలన్నీ దానికి కబురుచేసి

'నువ్వు చక్కని గొంతుతో రకరకాలుగా పలుకుతున్నందుకు మాకందరికీ చాలా సంతోషంగా వుంది. కానీ నువు చిలుకవలె పలకడం మానేశావని మాకు తెలిసి చాలా బాధపడ్డాము. కాబట్టి నువు ఈ క్షణం నుంచి ఎల్లప్పుడూ చిలుకవలె పలికి, చిలుకవలె పాడి, చిలుకవలె జీవించాలని ఆదేశిస్తున్నాము. కాకుంటే పండగల్లో, పబ్బాల్లో మాయందరి వినోదార్థం నువు నీ విద్యలు ప్రదర్శించవచ్చును' అని ముసలి చిలుకలు ఆదేశించాయి.

పలుకు చిలుక చిన్నబుచ్చుకున్నది.

చిలుక చిలుకవలె పలికితేను, గాడిద గాడిదవలె పలికితేను గొప్ప ఏవిటి?

అందులో కళ ఏముంది?

చక్కని మా చిలుక జాతిలో నా కళా కౌశలాన్ని గుర్తించే వారెవరూ లేరా?

సరసత ఎరిగినవారు గాని, కళామర్మజ్ఞులుగాని లేరా అని మధన పడుతుంటే ఓ గండుబిల్లి ఆ చిలుక వాలిన చెట్టెక్కింది.

చిలుక దానిని చూసి పులివలె గాండ్రించింది. కోయిలవలె కూసింది. పిల్లి వలె మ్యావ్ మ్యావ్ మన్నది.

ఆ పిల్లి చిలుక దగ్గరకు వచ్చి

'ఓ చిలుకా! నీ గొప్పదనాన్ని గుర్తించేను. ఇంతకాలం నేను చిలకలంటే తినడానికి పనికివచ్చే ప్రాణులని అనుకున్నానుగానీ, యింత గొప్పగా వినోదాన్ని కలిగించగలవని నేను అనుకోలేదు. నిన్ను నేను చాలా మెచ్చుకుంటున్నాను. నీవు చాలా గొప్పదానివి. నీకు అభ్యంతరం లేకపోతే నాతో మా యింటికి రా. నీకొక మంచి పంజరం చేయిస్తాను. నీకు కావల్సిన రకరకాల పళ్ళూ, కాయలూ అమరుస్తాను. పంజరంలో కూర్చుని నీకు నచ్చినట్టు పలుకు. మా పిల్లుల వల్ల నీకు ఎలాంటి అపకారం జరగకుండా నేను నా బంట్రోతుల్ని కాపలా వుంచుతాను' అని ఆ గండుపిల్లి చెప్పింది.

చిలుక కళ్ళనీళ్ళ పర్యంతరం అయిపోయింది.

'మా చిలుక జాతికి లేని రాసిక్యత నీకు వున్నందుకు నేను కొంచెం అసూయ పడుతున్నప్పటికీ నా గొప్పదనాన్ని నీవైనా గుర్తించినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. కళల్ని ప్రేమించే వారివల్ల నాకు ఎలాంటి ప్రమాదం లేదని నాకు తెలుసు. పద నేను నీతో వస్తాను' అన్నదది.

ఆ రోజు నుంచి ఆ చిలుక ఆ గండుబిల్లి సంరక్షణలో సుఖంగా వుండడం నేర్చింది.

ఆ పిల్లికి కూడా చిలుక మీద అభిమానం ఏర్పడింది.

అది వీలయినంతసేపు పంజరం దగ్గర కూర్చుని చిలుక పలుకులు వినేది. ఆ సమయంలో అవసరమయినప్పుడల్లా ఆ చిలుకను పొగిడేది.

'చిలుక సామ్రాట్' అనీ, 'చిలుక గంధర్వ' అనీ, 'విప్లవ చిలుక' అనీ రకరకాల బిరుదుల్ని కూడా యిచ్చేది.

ఇలాగ చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. హఠాత్తుగా గండు బిల్లికి ఏదో జబ్బొచ్చి అది చచ్చిపోయింది. దాని బంట్రోతులు చిలుక మీద జాలితో దానిని పంజరం నుంచి వదిలేశాయి. చిలుక ఆకస్మికంగా దిక్కులేనిదయిపోయింది.

పిల్లి కొలువులో వున్న కాలంలో అది చిలుక పలుకు మరిచిపోయింది.

చెట్ల మీదనుంచి ఎగరడమూ, పళ్ళూ, కాయలూ ఏరుకోవడమూ మరచిపోయింది. సంరక్షణ లేని ప్రపంచంలో ఎలాగ బ్రతకడమో దానికి తెలియలేదు.

అది ప్రయాస మీద నడుచుకుంటూ తను పుట్టిన రేగుచెట్ల తోపుకు వెళ్ళింది.

తక్కిన చిలుకలన్నీ వచ్చి దాన్ని పలుకరించాయి.

'ఆకలేస్తుంది బోయినం పెట్టండర్రా' అన్నది పలుకు చిలుక.

'ఇక్కడ ఎవరి బోయినం వారే సంపాదించుకోవాలి' అన్నాయి మిగతా చిలుకలు.

'కానీ నేను కళాకార్స్ కదా.. నేను మిమ్మల్ని రంజింప చేస్తుంటాను. నన్ను మీరు పోషిస్తూ వుండండి. నా కోసం దయచేసి ఒక పంజరం చేయించండి. నేను గాడిదలాగా ఓండ్రించగలను. పులిలాగా గాండ్రించగలను. పిల్లిలాగ అరవగలను. నెమలిలాగా కేకలు వేయగలను..' అన్నది పలుకు చిలుక.

దానికి మిగిలిన చిలకలన్నీ నవ్వేయి.

'మాకు కావాలంటే నిజం గాడిదల అరుపులూ నిజం పులుల గాండ్రింపులు, నిజం నెమళ్ళ కేకలూ మేం కావలిసినంతసేపు వినగలం.. అందుకోసం నిన్ను పోషించవలసిన అవసరం మాకేమీ లేదు. నువ్వు వెర్రి వేషాలు మానేసి చిలుకలాగా పలికితే మేం సంతోషిస్తాం.. మాతో కలిసి బతకనిస్తాం...' అన్నాయవి.

కానీ పలుకుచిలుక ఒప్పుకోలేదు. 'చిలుక పుటక పుట్టిన ఏ పిలక చిలకైనా చిలుకవలె పలకగలదు. చిలుక సామ్రాట్‌నైన నేను కూడా చిలక పలుకులే పలికితే నా గొప్ప ఏవుంది. నేను ప్రాణం పోయినా మామూలు చిలుకవలె ప్రవర్తించను. నేను స్పెషల్ చిలుకను' అన్నదది.

'నీ ఖర్మం' అనేసి మిగతా చిలుకలు ఎగిరిపోయాయి.

ఎగరడం మరిచిపోయిన పలుకు చిలుక నడుచుకుంటూ, ఈసురోమని వెళ్తుంటే దానికి ఓ జంగుబిల్లి ఎదురైంది.

"మ్యావ్" మంది పలుకు చిలుక దానిని రంజింప చెయ్యాలనే వుద్దేశ్యంతో.

'ఎవర్నువ్వు' అని అనుమానంగా అడిగింది జంగుబిల్లి.

"నేనో కళాకారుడ్ని. పుటకతో చిలుకనే అయినప్పటికీ నేను అడవిలోని అన్ని జంతువులను అనుకరిస్తూ పలుకగలను. మా కుటుంబ సభ్యులు నన్ను సరిగా అర్థంచేసుకోలేక పోయారు. వాళ్ళందరూ నన్ను మామూలు చిలుకలాగ చిన్న చూపు చూస్తుంటే నేను బాధపడుతూ వస్తుంటే నువు ఎదురైనావు' అన్నది.

'నిన్ను చూస్తుంటే నాకు నా కథ గుర్తుకొస్తున్నది. చెప్పేదా' అని ఆ జంగుబిల్లి అడిగింది.

'నాకు కథలంటే చాలా యిష్టం చెప్పు' అన్నది పలుకు చిలుక. జంగుబిల్లి మొదలుపెట్టింది.

## కళా ప్రియుడి కథ

"నేను పిల్లి పుటకే పుట్టేను గానీ, చాలా చిన్నతనంలోనే నేను మామూలు పిల్లిని కాదని గ్రహించేను. మామూలు చదువు సంధ్యలు పూర్తి చేసిన తరువాత నేను మా కుటుంబ సాంప్రదాయం కొద్దీ ఓ గంటసేపు తపస్సు చేసేను. వన దేవత ప్రత్యక్షం అయింది. నేను మామూలు జంగుబిల్లుల్లాగా అడ్డమైన వరాలూ కోరుకోలేదు. 'తల్లీ! నాకు ఉత్తమాభిరుచినీ, కళా తృష్ణనూ కలిగించు. జీవితాన్ని భిన్నంగానూ, కళాత్మకంగానూ తీర్చి దిద్దుకునే వరం యివ్వు" అని కోరుకున్నాను.

వనదేవత ఆ వరం యిచ్చేసి వెళ్ళిపోయింది.

ఆ క్షణం నుంచీ నేను పూర్తిగా మారిపోయాను.

రోజుకి మూడు పూటలా శుచిగా స్నానం చెయ్యడం అలవాటు చేసుకున్నాను. కళారాధన మీద మమకారం పెంచుకున్నాను.

తెల్లవారే లేచి టేకు చెట్టు ఎక్కిపోయి, ఉదయిస్తున్న సూర్యుడ్ని చూస్తూ ఒళ్ళు మరిచి పోయేదాన్ని, వానవేళ ఆకుల మీద నుంచి జారుతున్న నీటి ముత్యాల్ని ఏరి దండగుచ్చాలని ప్రయత్నించేదాన్ని. వాటి మీద సూర్యకాంతి పడితే నా ఆనందానికి అంతుండేది కాదు. కొండ చెరువులో ఉదయిస్తున్న చంద్రుడి మనోహరమైన నీడ చూస్తే నాకు ఆనందం కలిగేది. మేఘాలు ఆకాశంలో నా కోసం వెతుకుతూ తిరుగుతున్నట్టు అనిపించేది. పువ్వులన్నీ చంటి పిల్లల్లాగ గాలిలో పరిగెడుతున్నట్టు వూగేవి. లోకం సమస్తమూ సౌందర్యమయంగా, శోభాయమానంగా వుండేది. తోటి జంగుబిల్లులు ఈ సౌందర్యాన్ని చూడలేకపోయేవి. ఎంతసేపూ అవి కడుపు కక్కుర్తితో అలమటించి పోతుండేవి. దొరికిన పిట్ట, ఏదైనా ఆఖరికి పీతి గోర అయినా తినేసేవి. నేను మాత్రం అలా కాదు. అంత వికారంగానూ కళారహితంగానూ వికృతంగానూ వుండే ఆహార పదార్థాల జోలికి పోలేకపోయేదాన్ని. నేను తినే పిట్ట అందంగా, ఎంతో మనోహరంగా వుండాలి. దాని ఆటా, పాటా కూడా ఎంతో అందంగా వుండాలి. కర్రిగా, వికారంగా వుండే కాకిని నేనెలా తినగలను? నల్లగానే వున్నప్పటికీ మనోహరంగా కూసే కోయలను తినగలనుగాని, కాకిని నేనెలాగ తినగలను? శ్రవణ పేయంగా పలికే మైనగోరని తినగలనుగానీ, తీయని పలుకు అంటే ఎరగని బట్టగోరను నేనెలాగ తినగలను? నా కళాదృష్టీ, కళారాధనా

వున్నత స్థాయికి చెందినవి. అందువల్ల మన అడవిలోని జంగు బిల్లులన్నిటికంటే నేను భిన్నమైన దానిని. నాలాంటి జంగుబిల్లులు సృష్టిలో వుండే అవకాశం లేదు. చిలుకల్లో నువ్వెలాగో, పిల్లుల్లో నేనలాంటి దానినన్నమాట? మనిద్దరం యిలాగ కలుసుకోవడం వనదేవత యిచ్చ తప్ప మరొకటి కాదు' అని ఆ జంగుబిల్లి తన కథ చెప్పింది.

ఈ కథ విన్న పలుకు చిలక కొంచెం జడుసుకుంది.

'కళాపోషణ అంటే నేను ఇంతకాలం వేరే అనుకుంటున్నాను. కళాప్రియులు, కళాకారుల్ని తినడం కళాపోషణ కాదని నా అభిప్రాయం' అన్నది.

జంగుబిల్లి ప్రశాంతంగా నవ్వి 'నీ అభిప్రాయాల్ని నేను అర్థం చేసుకున్నానుగానీ, నీతో నేను విభేదిస్తున్నాను.. నువు కూడా నాతో విభేదించవచ్చు' అన్నది.

పలుకు చిలుక ఏడవలేక నవ్వింది.

'నువు నీకు వచ్చిన కళలన్నీ ముందు ప్రదర్శించు. ఆ తరువాత నేను నిన్ను తిని నీ కళని సార్థకం చేస్తాను' అన్నది జంగుబిల్లి.

పలుకు చిలుక తన కళల్ని ప్రదర్శించాలని చూసింది గానీ దానికి ఏడుపు తప్ప, కళ ఏమీ పలకలేదు.

జంగుబిల్లి ఒక అడుగు ముందుకు వేసి...

'సరే... నేను యిప్పుడు నిన్ను తింటానన్నమాట. కానీ ఒకటి నువు గుర్తుపెట్టుకో. నిన్ను మామూలు మురికిపిల్లో, కళాభిరుచిలేని మామూలు జంగుబిల్లో తినడం లేదు. ఉత్తమాభిరుచి గల, ఉత్తమజాతి జంగుబిల్లి నిన్ను తింటున్నది. అది నీ అదృష్టం అనుకో' అన్నది.

తర్వాత అది తీరికగా పలుకు చిలకని తినేసింది.

నేనీ కథ చెపితే మా మేనమామ చిరునవ్వు నవ్వుతూ విన్నాడు విని...

'నువు చెప్పిన కథలు నాకు అర్థం అయ్యేయి. ఆ సంగతి నీకు బోధపడటానికి వీలుగా నేనో కథ చెప్పనా?' అని అడిగాడు.

కథలు చెప్పేవాడికంటే వినేవాడే అధికుడు కాబట్టి చెప్పమన్నాను. మా మేనమామ ఈ కథ చెప్పాడు.

## ఒక సాలెపురుగు కథ

పూర్వం, నీ చిన్నప్పుడు మన పెరటి తోటలో ఒక సాలెపురుగుల కుటుంబం వుండేది. ఆ కుటుంబంలో పన్నెండు మంది అన్నదమ్ములుండేవారు. వాళ్ళందరికీ సాంప్రదాయానుసారంగా వస్తున్న కుటుంబ విద్యలన్నీ నేర్పడానికి పద్మశాలి అనే సాలీల గురువును అప్పగించారు. ఆ గురువుగారు అవసరమైన విద్యలన్నీ నేర్పి, తిరిగి వాళ్ళందర్నీ వారి తండ్రికి అప్పగించాడు. తండ్రి పిల్లలందర్నీ సమావేశపరిచి...

"మీ కందరికీ స్వయంగా బతకడానికి వీలుగా, సకల విద్యలూ నేర్పించాను. ఇంక ఎవరి మట్టుకు వారు హాయిగా, సంతోషంగా జీవించవలసిన సమయం వచ్చింది. మనది ఈ తోటలోనే పేరెన్నికగన్న కుటుంబం. కుటుంబ గౌరవానికి భంగం కలగకుండా జీవించండి...' అని ఉపన్యాసం చెప్పి పంపేసింది.

సాలె పురుగులన్నీ తండ్రిగారి కాళ్ళకు నమస్కరించి తలో దారీ వెళ్ళిపోయాయి. అందులో కడసారి సాలె పురుగు ఒక కుంకుడు చెట్టు ఎక్కి, నాలుగురోజులు కష్టపడి ఒక గూడు అల్లుకున్నది. గూడు అంతా పూర్తి చేసి అది నిద్దురపోయింది. పొద్దున లేచేసరికి దానికి బాగా ఆకలేసింది. గూటిలో ఏ చీమో, దోమో, ఏ తూనీగో చిక్కి వుంటుంది కదా తినవచ్చునని ఆలోచించి అది ఆత్రంగా వెతికింది. కష్టపడి అల్లిన గూటిలో ఏ పురుగు చిక్కలేదని గ్రహించి అది బాధపడింది. పోన్లే రేపైన దొరకదా అని సరిపుచ్చుకున్నది. గానీ ఆ రోజూ,

మరుసటి రోజూ కూడా దానికి ఏ పురుగూ చిక్కలేదు. దానికి కొంచెం అనుమానం వేసింది. ఎందుకైనా మంచిదని ఆ గూడువదిలేసి, అంత దూరాన వున్న చింతచెట్టు కొమ్మలో మరో గూడుకట్టింది. అందులో కూడా దానికి ఏ పురుగు కూడా చిక్కలేదు.

సలహా కోసం అని అది తన పెద్దన్న యింటికి వెళ్ళింది. వారం రోజుల్నించి తిండి లేక చిక్కిపోయిన తమ్ముడ్ని చూసి అన్నగారు కంగారుపడి ఒంట్లో బాగోలేదా అని వాకబు చేసింది. అదేం కాదని చిన్న సాలీడు అసలు సంగతి చెప్పింది. అలాకాదు, నువు అల్లిన గూటిలో ఏదో లోపం వుందని నా అనుమానం. పద నేనొచ్చి చూస్తానని వెళ్ళి తమ్ముడు అల్లిన గూడు చూసింది.

చూసి.

"ఇదేవిటి తమ్ముడూ సాలె గూడు అల్లేవు?" అని ఆశ్చర్యంగా అడిగింది.

"మనం సాలె పురుగులం కాబట్టి సాలెగూడు అల్లేను.. తప్పా?" అని అమాయకంగా అడిగింది చిన్న సాలీడు.

"నువు చెప్పింది నిజమే కానీ చిన్నదానివి కాబట్టి ఒక మర్మం కనిపెట్టలేకపోయావు. మనం సాలెగూడే అల్లాలి కానీ అది సాలె గూడులాగా కనబడకూడదు. భగవంతుడు మనకి ప్రసాదించిన కళా కౌశలాన్ని ఉపయోగించుకోవాలి. నీకు చీమల్ని తినాలని వుందనుకో. నువు చీమల పుట్టలాగా కనిపించే సాలెగూడు అల్లాలి. అప్పుడవి తప్పకుండా వచ్చి నీ గూటిలో చిక్కుకుంటాయి. చూడగానే సాలెగూడు అని తెలిసిపోయిందనుకో. అవి నీ గూట్లోకి ఎందుకు వస్తాయి? రోజులు మారిపోయాయి తమ్ముడూ! ఈగలూ, దోమలూ తెలివి మీరిపోయాయి. మారిన కాలాన్ని బట్టి మనం కూడా మారాలి. లేకపోతే బతకలేం! నువు ఏ పురుగుని తినాలని, ఏ దోమని ఆకర్షించాలని చూస్తున్నావో దానికి నచ్చే గూటిని అల్లాలి. దానినే కళాకౌశలం అంటారు. మన కళ పొట్ట నింపడానికి తప్పకుండా ఉపయోగపడాలి' అని అన్నగారు హితబోధ చేసింది.

కానీ చిన్న సాలెపురుగు ఒప్పుకోలేదు.

'అన్నయ్యా! జాతీ నీతీ వున్న సాలె పురుగుల కుటుంబంలో పుట్టిన నేను సాలి పురుగులాగా మాత్రమే జీవించాలని నిర్ణయించుకున్నాను. సాలిగూడు మాత్రమే అల్లుతాను. చూడగానే సాలెగూడు అని తెలిసిపోయే గూటిని మాత్రమే అల్లుతాను. పొట్ట కూటికోసం పురుగుల్నీ, దోమల్నీ రంజింప చేయడం కోసం నేను కళల్ని ఆశ్రయించలేను. నా వల్ల కాదు. నేను నా అస్తిత్వాన్ని ఒదులుకోలేను' అని అది ఖండితంగా చెప్పేసింది.

'అది సరే.. మరి బోయినం సంగతి ఏమిటి? నీకు అన్నం ఎవరు పెడతారు?' అని కంగారుగా అడిగింది పెద్ద సాలీడు.

ఈ ప్రశ్నకు చిన్న సాలీడు చిన్నబుచ్చుకుంది 'నువు అనవసరంగా కంగారుపడకు. బోయినం కోసం నీ గడప తొక్కను. నీకు వచ్చిన బయ్యం లేదు. నేను నాకు నచ్చిన రీతిలో బతికి, నచ్చిన రీతిలో చావదలచుకున్నాను. నా గురించి నువు చింతించవద్దు. నేను కళాకారుడిగా మారి బతకదలుచుకోలేదు. సాలె పురుగులాగా బతకగలిగితే బతుకుతాను. లేదంటే చస్తాను..' అనేసి అక్కడ్నించి వెళ్ళిపోయింది. తోట గట్టు దగ్గరి జిల్లేడు చెట్టుమీద అది ఓ కొత్తగూడు అల్లి, అందులో దోమైనా చిక్కుతుందేమోనని ఎదురుచూడటం మొదలుపెట్టింది. కాని తెలిసి తెలిసీ సాలిగూటిలోకి వెళ్ళి చిక్కుకునే వెర్రి చీమలు గానీ, దోమలు గానీ మన తోట మొత్తం మీద లేవు గద. కాబట్టి దానికి తిండి దొరకలేదు. ఈలోగా ఒక ముక్కు పిట్ట అలా వచ్చింది. దానికి సాలె పురుగులంటే చాలా యిష్టం. వస్తూనే అది సాలెగూటిని చూసి రయ్యిమని వచ్చి ఆ చిన్న సాలి పురుగుని మింగేసి చక్కా పోయింది.'

అని చెప్పి మా మావయ్య వెటకారంగా నవ్వి 'అర్థం అయిందా?' అని అడిగాడు

నాకు ఉడుకుమోత్తనం వచ్చింది. 'నువ్వీకథ ఎందుకు చెప్పావో నాకు అర్థం అయింది. కానీ కథల్ని

నమ్మి నేను నా అభిప్రాయాలు మార్చుకోలేను. నా ఆత్మకథ నా యిష్టం వచ్చిన రీతిలో నేను రాసుకుంటాను. నీకు నచ్చకపోతే నువు చదవొద్దు. కావాలంటే నీకు నచ్చిన పద్ధతిలో నీ ఆత్మకథ రాసుకో. నాకు అభ్యంతరం లేదు...' అన్నాను.

మా మేనమామ అప్పటికి ఏవీ అనకుండా వెళ్ళిపోయాడు.

• • •

మా కుటుంబమంతా తూనీగలమీద సవారీ చేస్తుంటుంది. నేనొక్క దాన్నే సీతాకోకచిలుకనెక్కి తిరుగుతుంటాను.

అసలు సీతాకోకచిలుక మీద సవారీ చేయడం చాలా కష్టమైన పని. దానిని లొంగదీసుకోవడం, మనకు కావలసిన దగ్గరకు దానిని ఎగిరేట్టు చెయ్యడం సామాన్యమైన విషయాలు కావు. అవి ఆకస్మికంగా ఫల్టీలు కొడుతుంటాయి. ఒక క్రమం లేకుండా ఎగురుతుంటాయి. అందుచేత మా కుటుంబంలో మామూలు దెయ్యాలు సీతాకోక చిలుకల జోలికి పోవు.

సీతాకోక చిలుకల మీద తిరుగుతుంటాను కాబట్టి నన్ను కొంత గౌరవంగా కూడా మా వాళ్ళు చూసుకుంటూ వుంటారు.

ఇలా వుండగా మా పెరటిలోని విప్పచెట్టు పూతకొచ్చింది. ఆ కాలంలో విప్పపూలు తినడానికీ, వాటిలోని తేనె తాగడానికీ కింపురుషులనే వాళ్ళు నెమళ్ళమీద ఎగురుతూ వస్తూండటం మామూలే.

ఈ కింపురుషులనే వాళ్ళు ఎవరో, ఎక్కడ నుంచి వస్తుంటారో నేనెప్పుడూ పట్టించుకోలేదు. లోకంలో వుండున్నటువంటి సమస్త జీవజాలంలో మా దెయ్యాలే ఉత్కృష్టమైనవి కాబట్టి, దెయ్యాల్లో కూడా మా గుండు దెయ్యాలే మేలిమి జాతి కాబట్టి, ఆ గుండు దెయ్యాల్లో కూడా మా కుటుంబమే గొప్పది కాబట్టీ, మా కుటుంబంలో కూడా నేనే గొప్పదాన్ని కాబట్టి రెక్కల గుర్రాల్లాంటి నెమళ్ళెక్కి తిరిగేవాళ్ళని నేనెందుకు ఖాతరుచేయాలి?

కాబట్టి ఆ కింపురుషుల్ని నేను ఖాతరు చెయ్యలేదు. ఓ రోజు నేను సీతాకోకచిలుకనెక్కి, వెన్నెట్లో సరదాగా తిరుగుతున్నాను. మా విప్పచెట్టు మీద ఒక నెమలీ, దానిమీద సవారీ చేసి వచ్చిన కింపురుషుడు మాత్రమే వున్నారు. ఆ గుర్రపు మొగంవాడితో మనకెందుకని నేను పట్టించుకోలేదు. కానీ అనుకోకుండా నేనెక్కిన సీతాకోకచిలుక తిన్నగా పోయి ఆ నెమలి నెత్తిమీదున్న పింఛంమీద వాలింది.

అప్పుడు ఆ నెమలి పక్కనే వుండి విప్పపువ్వు నవుల్తున్న కింపురుషుడు నన్ను చూసి..

'ఎవర్నువ్వు?' అని అడిగాడు.

'నువ్వెవరో నాకు తెలియదు. కాబట్టి నేనెవరో నీకు తెలియవలసిన అవసరం లేదు కదా' అన్నాను నేను పెంకిగా.

నువ్వెవరో నాకు తెలియకపోయనా ఫర్వాలేదు. కానీ, నేనెవరో నీకు తెలియకపోతే ఎలాగ? ఇప్పటికైనా తెలుసుకో.... నేను కింపురుషుల రాజుని. మేం దేవగణాల కుటుంబానికి చెందినవాళ్ళం..." అన్నాడతను.

'నువ్వెవరో నాకు తెలియకపోయినా నాకు నష్టం లేదు. కానీ నువ్వెవరో నాకు తెలీకపోతే నీకు నష్టం అని నాకు అర్థం అయింది. నువ్వెవరో నాకు తెలియడంవల్ల నాకేమీ లాభం లేదని నాకు తెలుసు. అలాగే నేనెవరో నీకు తెలియకపోతే నాకు గానీ, నీకు గానీ నష్టం లేదని నా అభిప్రాయం" అని నేను వివరంగా చెప్పాను.

నా మాటలు విని ఆ కింపురుషుడు ఆశ్చర్యపోయాడు.

'నువ్వెవరోగానీ జ్ఞానివలె వున్నావు. జ్ఞానులు సీతాకోకచిలుకలమీద తిరగడం నేను యింతకు ముందు ఎప్పుడూ చూడలేదు... అన్నాడా కింపురుషుడు. ఆ మాటలకు నేను మరీ ఆశ్చర్యపోయాను.

'ఓ కింపురుషుడా! నువ్వు సామాన్యుడవు కావు.. అవును! నేను జ్ఞానినే. ప్రపంచంలో ఆ సంగతి ఇంతవరకూ నా ఒక్కదానికే తెలుసు. ఆ రహస్యం నాకు తప్ప యితరులెవ్వరికీ తెలియదు. ... ఆ సంగతి నేనే స్వయంగా చెప్పుకోలేకా, లోకం ఆ సంగతి గ్రహించకా, యింతకాలం నాలో నేనే మధనపడుతూ వచ్చాను. నువ్వు నన్ను చూడగానే పోల్చుకున్నావు...' అన్నాను.

'నువ్వు విప్పపూలు తిండానికి వచ్చావా?' అని ఆ కింపురుషుడు ప్రశ్నించాడు.

'ఛీ...నేనే...కాదు....మా పిశాచ జాతిలో ఎవ్వరూ విప్పపూలు తినరు.. నేను ఈ చెట్టు మీదకి వూరికే వచ్చా...' అన్నాను.

"నువ్వేమైనా పని చేస్తుంటావా?" అని ఆ కింపురుషుడు అడిగాను.

'ఛీ.... నేనేమీ చెయ్యను. నేను ఆలోచిస్తుంటాను....'

'ఆ సంగతి నిన్ను చూడగానే పోల్చుకున్నాను.. జ్ఞానులు వట్టి పనికిమాలిన వాళ్ళు.. నేనున్నానుకో... నేనీ చెట్టు మీదకి ఊరికే రాలేదు విప్పపూలు తినడానికి వచ్చాను. ఈ నెమలి కూడా అందుకే వచ్చింది. నువ్వు ఊరికే వచ్చావు. అందుకే నువు జ్ఞానివని పోల్చేశాను.. ఎవరైతే అర్ధరాత్రిపూట పనీపాటా లేకుండా చెట్లూ, పుట్టలూ పట్టుకు తిరుగుతుంటారో వాళ్లు జ్ఞానులు కాక ఏమవుతారు?"

ఆ గుర్రపు మొహం కింపురుషుడి మీద నాకు చాలా కోపం వచ్చింది.

'జ్ఞానులు పనికిమాలినవాళ్లు అని నువ్వొక సిద్ధాంతాన్ని ప్రతిపాదించావు. అక్కడితో సరిపోదు... నిరూపించు' అని పట్టుదలగా అడిగాను.

కింపురుషుడు ఆరు విప్పపూలు నెమ్మదిగా తిని, నెమలి వీపు మీద వెల్లకిలా పడుకుని ఆకాశం కేసి చూస్తూ ఈ కథ చెప్పడం మొదలు పెట్టాడు.

## ఒక జ్ఞాన గంధర్వుడి గాథ

పూర్వం ఒకానొక్కపుడు ఆకాశగంగా తీరాన కొంతమంది గంధర్వులు నివసించేవాళ్ళు. గంధర్వుల బతుకు గురించి నీకుతెలుసో లేదో గానీ, వాళ్ళు పాటలు పాడి పొట్ట పోషించుకునే రకం. చెట్ల దగ్గరకు వెళ్ళి వాటికి నచ్చిన పాటలు పాడి అవి యిచ్చిన ఫలాలు తింటారు. తేనెటీగల దగ్గరకు వెళ్ళి గంటల తరబడి, తీయని పాటలు పాడి అవి యిచ్చిన తేనెతో కడుపు నింపుకుంటారు. మేఘాలకు మంచి మంచి పాటలు వినిపించి అవి రాల్చిన వాన చినుకులు తాగుతారు. అటువంటి గంధర్వుల కుటుంబంలో ఒక కాదల్చుకున్న జ్ఞాని జన్మించాడు. అతడు లోకంలో వున్న సమస్త జ్ఞానాన్నీ సంపాదించడానికి పూనుకొన్నాడు. అనేక వేల సంవత్సరాలు భగవంతుడి కోసం తపస్సు చేశాడు. చివరికి పరమశివుడు ప్రత్యక్షమై..

"వెర్రివాడా! నువు జ్ఞానం కోరి తపస్సు చేస్తున్నట్టు నాకు తెలుసు. కానీ నువు భగవంతుడి కోసం తపస్సు చేశావు.. అంటే నా కోసమా? విష్ణుమూర్తి కోసమా? బ్రహ్మదేవుడికోసమా? సరస్వతీ, లక్ష్మి, పార్వతీదేవి కోసమా? ఎవరి కోసం తపస్సు చేస్తున్నావు? మాలో ఎవరు ప్రత్యక్షం కావాలో నువు చెప్పకపోతే మాకు ఎలా తెలుస్తుందనుకున్నావు? ఇటువంటి వెర్రి పని ఎన్నడూ చేయకు. ఎవరు నిన్ను కటాక్షించాలని కోరుకుంటున్నావో వారినే స్పష్టంగా తలచుకో.. నేను భోళాశంకరుడ్ని కాబట్టి వచ్చాను గానీ లేకపోతే నువు కోటి సంవత్సరాలు తపస్సు చేసినా ఎవరూ ప్రత్యక్షం కారు. ఇకనైనా గ్రహించు. సరేలే.. నువు కోరిన వరం అనుగ్రహిస్తున్నాను... తపస్సు మాని సంతోషంగా యింటికి వెళ్ళు" అనేసి శివుడు వెళ్ళిపోయాడు.

మరుక్షణమే మన గంధర్వుడికి జ్ఞానం వచ్చేసింది. కొబ్బరి బొండాంలోకి నీరు వూరిన చందాన అతని మెదడులో జ్ఞానం వూరింది.

ఆకలిగా వున్నాడు కాబట్టి దగ్గరగా వున్న సీతాఫలం చెట్టు దగ్గరికి వెళ్ళి మధురమైన గొంతుకతో పాటలు పాడటం మొదలుపెట్టాడు.

వరుసగా పదిహేను పాటలుపాడినా ఆ చెట్టు అతనికి ఒక్క సీతాఫలమూ యివ్వలేదు. ఇదివరలో అయితే అయిదు పాటలు పాడితే ఆ చెట్టు అతడ్ని కౌగిలించుకుని పది పండ్లు యిచ్చేది.

దాంతో ఆ గంధర్వుడికి కోపం వచ్చింది. పాటలు ఆపి–

'ఓ వృక్షమా! ఇదేమి అన్యాయం? ఇది వరకు నేను వెర్రిమొర్రి పాటలు పాడితేనే నువు అమృత సమానమైన సీతాఫలాలు యిచ్చేదానివి. అటువంటిది యిప్పుడు ఘోరమైన తపస్సు చేసి, అనంతమైన జ్ఞానాన్ని సంపాదించి పాడుతున్నాను. ఇంత మంచి పాటలు పాడినా నువు మెచ్చుకోవడం లేదు. సంగీతమూ, జ్ఞానమూ నిన్ను రంజింపచేయలేక పోతున్నాయా?' అని అడిగాడు.

'అది కాదు మిత్రమా... ఇది వరకు నువు గంధర్వులకు సహజమైన పాటలు పాడేవాడివి. అందులోని విషయాలు నాకు అర్థం అయ్యేవి. ఇప్పుడు నువు జ్ఞాన సంబంధమైన పాటలేవో పాడుతున్నావు.. ఇవి నాకు అర్థం కావడం లేదు.. ఇవి వింటే నాకు తన్మయత్వం కలగడం లేదు.. అయినా సరే, యివిగో, ఈ అయిదు ఫలాలూ తీసుకెళ్ళు.. రేపట్నించి నువు నా దగ్గరకు వచ్చి పాడనక్కర్లేదు... నాకు జ్ఞానం కావాల్సి వచ్చినప్పుడు నేనే కబురంపుతాను..' అని పలికి ఆ చెట్టు అతనికి అయిదు సీతాఫలాలు రాల్చింది.

ఆ గంధర్వుడు ఆ ఫలాలు తీసుకొని అంగీలో పడేసుకొని –

అజ్ఞానంలోని ఆనందం సహజమైనదే అయినప్పటికీ అది భ్రమతో కూడుకున్నదనీ, అజ్ఞానం దుఃఖ హేతువు కాబట్టి వారికి ఆనందం కలిగే అవకాశం లేదనీ వివరిస్తూ మరో పాట పాడేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచీ అతనికి ఆదాయం పడిపోయింది. అయినా అతను విచారించలేదు –

బతుకుతెరువు కోసం యితరులకు నచ్చే పాటలు పాడేవారు పాట కూలీ అవుతాడనీ, బతుకుతెరువు కోసమే తనకు, ఇతరులకూ నచ్చే పాటలు పాడేవాడు మామూలు పాట కూలీ అవుతాడనీ, తనకు నచ్చి, యితరులకు నచ్చకపోయినా, ఇతరుల హితవు కోరి, ఇతరుల్ని జ్ఞాన మార్గం వేపూ, కర్మమార్గం వేపూ నడిపించేవాడు వైతాళికుడు అవుతాడనీ అతను అనుకునేవాడు.

ఒకనాడతను ఆకలితో ఒక బండరాయి మీద విశ్రాంతి తీసుకుంటుండగా రెండు సింహాలు ఒక జింక మాంసం కోసం ఘోరంగా పోట్లాడుకోవడాన్ని చూశాడు.

గభాలున లేచి, ఆ సింహాల దగ్గరకు వెళ్ళి –

'మీరీ విధంగా పోట్లాడుకోవడం తగనిపని – భగవంతుని సృష్టిలో బోలెడంత మాంసం వుంది. దీన్ని ఇద్దరూ పంచుకోవచ్చు. లేదా మీలో ఒకరు దీనిని రెండో సింహానికి వదిలేసి హృదయ వైశాల్యాన్ని ప్రకటించుకోవచ్చు. ఆ పని మీరు చేస్తే భగవంతుడు కూడా సంతోషిస్తాడు. నేనూ సంతోషిస్తాను. లేదా – మీరిద్దరూ కూడా విశాల హృదయంతో ఈ జింకని నాకు బహూకరించవచ్చు అప్పుడు నేనూ నా యందున్న భగవంతుడు కూడా ఇంకా ఎక్కువ సంతోషిస్తాడు' అని వుపదేశించింది.

అప్పుడు సింహాలు రెండూ కలిసి ఆ జ్ఞాన గంధర్వుడ్ని తొడబట్టుకు చీరేశాయి.

ఒక చెట్టు మీద కూచుని యిదంతా చూస్తున్న ఒక బ్రహ్మరాక్షసి గభాలున వచ్చి, ఆ సింహాలు రెంటినీ జుత్తుపట్టుకుని నేలకేసి చితక్కొట్టేసింది.

అవి పుంజాలు తెంపుకుని అక్కడ్నించి పారిపోయాయి.

నేల మీద దొర్లుతూ జ్ఞానం ఓడుతున్న గంధర్వుడిని ఆ బ్రహ్మరాక్షసి లేపి –

'నిన్న రాత్రి నాకు బగమంతుడు కలలోకి వచ్చి నీకు నిజమైన జ్ఞానం వుపదేశించమని బతిమాలుకున్నాడు. 'జ్ఞానం అంటే ఏమిటో నీకు యిప్పటికైనా అర్థం అయిందనుకుంటాను. నీకు జింకమాంసం కావాలంటే స్వయంగా వేటాడు. లేదా వేటాడిన సింహాలను తరిమేసి, వాటి దగ్గర్నుంచి లాక్కో, అంతేగానీ వాటికి నీతులు చెప్పి ప్రయోజనం లేదు. ఇదే జ్ఞానమంటే' అనేసి జ్ఞానం వుపదేశించి, ఆ జింక మాంసాన్ని భుజాన వేసుకుని అది బయలుదేరింది.

'అంత జ్ఞానాన్ని యిచ్చిన దానివి కొంచెం మాంసం కూడా యివ్వొచ్చు కదా?' అనడిగాడు జ్ఞానగంధర్వుడు

దానికా బ్రహ్మరాక్షసి అడివంతా జడుసుకునేట్టు నవ్వి –

'పిచ్చివాడా జ్ఞానం ఎవరైనా యిస్తారు మాంసమో, బోయినమో నువ్వు స్వంతంగా సంపాదించుకోవాల్సిందే... అర్థం అయిందా? ఇదే జ్ఞాన మార్గంలో ఆఖరి పాఠం...' అనేసి ఆ బ్రహ్మరాక్షసి మాయం అయిపోయింది.

కింపురుషుడు చెప్పిన ఈ కథ విని నాకు నవ్వొచ్చింది. కింపురుషుడి అజ్ఞానానికి నాకు జాలేసింది. నేను ఆ కింపురుషుడ్ని చూసి –

'కింపురుషుడా! నేను చెప్పేది జాగ్రత్తగా విను. నువు ఎప్పుడో మీ ముత్తాతల నాటి పరిస్థితి దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నట్టున్నావు. జ్ఞానం అంటే నువు వేదాంతమనీ, తత్వమనీ, లోకజ్ఞానమనీ పొరపడుతున్నట్టున్నావు. ఇటువంటి పొరపాటు లోకంలో చాలామంది చేస్తున్నారు. నీకు ఈ విషయం సులభంగా అర్థం కావడానికి ఒక కథ చెబుతాను విను.'

## లెక్కల తాబేలు కథ

'ఇక్కడికి నూరు యోజనాల దూరంలో ఏడు వంపుల కాలువ ఒడ్డున రెక్కల తాబేళ్ళ దేశం ఒకటి వున్నదన్న సంగతి నువు వినే వుంటావు. రెక్కలున్నాయి గదా అని ఆ తాబేళ్ళు ఎక్కువ సేపు ఎగరటమే వ్యాపారంగా పెట్టుకున్నాయి. ఆ దేశంలో ఒక రెక్కల తాబేలు ఊసుపోక కాలక్షేపం కోసం ఎక్కాలు నేర్చుకుంది. యాభైయ్యో ఎక్కం దాకా అది కంఠతా పట్టేసింది. అటునుంచి ఇటుగానీ, ఇటునుంచి అటుగానీ ఏ ఎక్కమైనా ఠపీమని చెప్పేయగలిగేది. దానికి తోడు దానికి లెక్కల్లో కూడా ప్రావీణ్యం అబ్బింది. ఒక తాబేలు రోజుకి ఒక గంటపాటు ఎగరడానికి ఎంత శక్తి అవసరమో, ఆ శక్తి సంపాదించడానికి ఎన్ని చేపల్ని తినాలో, ఎన్ని వానపాముల్ని భోంచేయాలో అది లెక్కలు కట్టి చెప్పేసేది. తాబేళ్ళ రాజ్యపు వైశాల్యమూ, ఎల్లలూ, అన్నీ అది గుణించేసి తోటి తాబేళ్ళని ఆశ్చర్యపరిచేది. దాని కీర్తి ఈ నోటా, ఆ నోటా పడి చివరికి తాబేటి రాజుకి చేరింది. తాబేటి రాజు ఆ లెక్కల తాబేల్ని పిలిపించి, దాని శక్తి సామర్థ్యాలు స్వయంగా పరీక్షించింది. పరీక్షించి నీ పాటి జ్ఞాని ఈ సృష్టిలో లేదని తేల్చేసింది. రాజుగారి కంటే ముందే మిగిలిన రెక్కల తాబేళ్ళు దానిని జ్ఞానిగా గుర్తించాయి.

అక్కడి నుంచీ రాజు మొదలు ఆ రాజ్యంలోని వారందరూ లెక్కల తాబేలు మాట వేద వాక్కుగా భావించి పాటించేవారు. అది లెక్కలు వేసి వర్షాలు ఎప్పుడు పడతాయో ముందే చెప్పేది. ఇప్పుడెన్ని రెక్కల తాబేళ్ళున్నాయి. ఏడాదికి యిన్ని తాబేళ్ళు పుడుతున్నాయి. సాలీనా యిన్ని తాబేళ్ళు చస్తున్నాయి అని లెక్కలు వేసి పదేళ్ళ తర్వాతెన్ని రెక్కల తాబేళ్ళుంటాయో అది లెక్కలు కట్టి చెప్పేది.

దాని పలుకుబడి ఎంతగా పెరిగిపోయిందంటే దాని సలహా లేందే రాజుగారు ఏమీ చేసేవాడు కాదు. దానితో ఆ లెక్కల తాబేలు ఆ రెక్కల తాబేళ్ళ రాజ్యంలోని అన్ని విషయాల్లోనూ కలుగజేసుకోవడం మొదలు పెట్టింది. చేపల్ని ఎలా పట్టాలో అది చెప్పేది. పొద్దున్న ఎన్ని గంటలకు లేచి తాబేటి రాజ్య ప్రజలు ఏం

చేయాలో అదే నిర్ణయించేది. పాటలు ఇలా వుండాలి అనేది, అలా వుండాల్సిందే. నాట్యం ఈ రీతిగా వుండాలనేది. నాట్యం చచ్చినట్టు అలాగే ఉండేది.

ఆ తాబేటి రాజ్యం పక్కనే తోకలేని కోతుల ద్వీపం ఒకటి వుండేది. ఇప్పుడూ వున్నాది. ఆ రాజ్యంలో అనేక కాలువలూ, చెరువులూ వున్నాయి. మరో పదేళ్ళు పోతే లెక్కల తాబేళ్ళకి ప్రస్తుతం వున్న రాజ్యం చాలదు కాబట్టి పక్కనున్న కోతుల రాజ్యం మీదకి దండెత్తి దాన్ని ఆక్రమించుకోవాలని తాబేటి రాజుకి లెక్కల తాబేలు సలహా యిచ్చింది.

మనకి రెక్కలున్నప్పటికీ ఆ కోతులకి చేతులున్నాయి కాబట్టి అవి రాయి తీసుకుని వీపు మీద ఒక దెబ్బ వేస్తే ఎంత లెక్కల తాబేలైనా చచ్చి వూరుకుంటుంది కాబట్టీ అది మంచి ఆలోచన కాదని లెక్కల తాబేటి రాజుగారి ముసలి మంత్రి సలహా యిచ్చాడు.

వెంటనే లెక్కల తాబేలు గంటమూ, తాటాకులూ అందుకుని, తోకలేని కోతి బరువు యింత, కాబట్టి దాని చేతి తాలూకు శక్తి యింత... కాబట్టి అది ఫలానీ ఇంత బరువైన రాతిని మాత్రమే ఆయుధంగా ఉపయోగించగలదు. కాబట్టి ఆ కోతి, ఆ చేత్తో, ఆ రాత్తో కొడితే పలానీ ఇంత బరువైన దెబ్బ తగుల్తుంది.

ఇటు చూస్తే రెక్కల తాబేటి కవచపు మందం యింత. అది ఫలానా యింత బరువైన దెబ్బను తట్టుకోగలదు. అది కూడా ఆ కోతి ఫలానీ యింత వేగంతో, ఫలానీ యింత బరువుతో కొడితే ఈ తాబేటి కవచం తట్టుకోగలదు... అని తాటాకు మీద లెక్కలు వేసి...

'కాబట్టి.... తోకలేని కోతులు కొట్టే దెబ్బలు మన తాబేటి చిప్పను పగలగొట్టలేవు. మనం ఎగురుకుంటూ వెళ్ళి ఆ కోతుల మీద పడి వాటి బుర్ర బద్దలు కొట్టేద్దాం... మరేం ఫర్వాలేదని అది సలహా చెప్పింది.

ముసలి మంత్రి కూడా ఆ లెక్కల్ని కాదనలేకపోయాడు.

లెక్కల తాబేటి సలహాతో, తాబేళ్ళ సేనలు తోకలేని కోతుల రాజ్యం మీద దండయాత్ర మొదలుపెట్టాయి. ఒక గంటసేపు ఘోరమైన యుద్ధం చేసేసరికి కోతులు కొంచెం వెనకడుగు వేశాయి.

అప్పుడు ఒక ముసలి కోతి తన మీదకు వచ్చిన లెక్కల తాబేలుని రెండు చేతుల్తో పట్టేసుకుని దాని వీపు మీద రాతితో బాదడం మొదలుపెట్టింది. లెక్కల తాబేలు చిప్పలోంచి పకపక నవ్వి...

"నువ్వు మూర్ఖురాలివి... నా లెక్కల ప్రకారం నా డిప్ప పగల గొట్టడానికి నీ శక్తి చాలదు.. నువు నన్నేం చెయ్యలేవు అన్నది.

దానికి ముసలి కోతి నవ్వింది.

'వెర్రి వెధవా.. నిన్ను చంపడానికి నీ డిప్పే పగలగొట్టనక్కరలేదు.. ఇదుగో తిరగేసి కొడుతున్నాను.. మీ బాబుతో చెప్పుకో' అని... ఆ లెక్కల తాబేల్ని తిరగేసి చేతిలో వున్న రాత్తో ఒక మోదు మోదింది.

'అయ్యో...... తిరగేసి కొడితే ఎంత దెబ్బకు చస్తానో లెక్కలు వేయనే లేదు గదా' అని విచారిస్తూ ఆ లెక్కల తాబేలు చచ్చి వూరుకుంది. మిగిలిన కోతులు పావుగంట సమయంలో దురాక్రమణదారుల్ని 'తిరగేసి కొట్టు' అనే వ్యూహాత్మక యుద్ధంలో చంపేసి పీడా వదిలించుకున్నాయి.

ఆ రకంగా ఒక జ్ఞాని వల్ల ఒక రాజ్యం సర్వనాశనం అయిపోయింది. కాబట్టి కేవలం లెక్కలు బాగా వొచ్చినాయనో, పాటలు బాగా పాడే వాడనో, కవిత్వం బాగా రాస్తాడనో ఎవడ్నీ జ్ఞానిగా గుర్తించకూడదు... వారి వెనుకబడి వెళ్ళి పోకూడదు... అని నేను కథ ముగించాను.

ఆ కథ కింపురుషుడు ప్రశాంతంగా విని...

మరైతే జ్ఞానం అంటే ఏమిటి? నువ్వు ఏ రకమైన జ్ఞానివి.. నీ వల్ల ఈ లోకానికి ఉపకారం ఏమిటి? అని కొంచెం జంకుతూ అడిగాడు.

చెప్పేవాడికి వినేవాడు లోకువ అని తెలిసే అడుగుతున్నావా? తెలీక అడుగుతున్నావా? అని నేనా కింపురుషుడ్ని వెక్కిరింతగా అడిగాను.

'అదేట్రా బాబూ... నువు కొత్త సంగతి చెబుతున్నావు? నువ్వు చెప్పేదాన్ని వినేవాడు నమ్మాలని నువు కోరుకుంటావు.. నమ్ముతున్నాడో లేదోనని అనుమానిస్తావు. నమ్మరా బాబూ అని బతిమాలుకుంటావు.. అవునా కాదా? మరటువంటప్పుడు ఎవరు ఎవరికి లోకువ' అని కింపురుషుడు అడిగాడు.

నేనో క్షణం ఆలోచించి –

'నువు చెప్పింది నిజమే... ఆ సంగతి నాకూ తెలుసు... అదలా వుంచి నే చెప్పేది విను... నాకు ఏ రకమైన జ్ఞానం వున్నదో తెలుసుకోవాలని నీకుంది గదా. నిజానికి జ్ఞానం అంటే వేరేమీ కాదు. ఎదటివాడి అజ్ఞానాన్ని గుర్తించడమే జ్ఞానం అంటే.. తుమ్మెదలూ, సీతాకోకచిలుకలూ పూవుల వునికిని గుర్తించినట్టు నెమళ్ళు విప్పచెట్లను గుర్తించినట్లు, నేను అజ్ఞానం ఎక్కడున్నదో చప్పున గుర్తించగలను.. అదే నా ప్రత్యేకత......' అన్నాను.

కింపురుషుడు నవ్వేడు.

'అంటే నువు ఎదటివారిలోని అజ్ఞానాన్ని చప్పున గుర్తించగలనంటావు?'

'అవును.... అవతలివాడు ఎంతవాడైనా, అతడి అజ్ఞానాన్ని చూసీ చూడగానే నేను పోల్చుకోగలను...'

'మరి నీలోని అజ్ఞానం సంగతి ఏమిటి?

'నాలోని అజ్ఞానాన్ని గుర్తించడం నీ బాధ్యతగానీ నా బాధ్యత ఎలా అవుతుంది? అజ్ఞానాన్ని కలిగి వుండడం వరకే నా బాధ్యత. దాన్ని గుర్తించి ఆనందించడం నీ బాధ్యత.

'కానీ అజ్ఞానం వల్ల ఆనందం ఎలా కలుగుతుంది? అజ్ఞానం దుఃఖహేతువని నేను చిన్నప్పుడు చదువుకున్నాను....' అన్నాడు కింపురుషుడు.

'నేను మాత్రం ఏమంటున్నాను... నా అజ్ఞానంవల్ల నాకు దుఃఖం కలగవచ్చుగానీ, నీకు ఆనందం కలగవచ్చును గదా? ఏటంతావు?' అని నేను సరదాగా రెట్టించాను.

కింపురుషుడు విషాదంగా తల వూపి 'లేదురా అబ్బాయీ..... ఒక వ్యక్తి అజ్ఞానం వల్ల యితరులందరూ దుఃఖపడిన సందర్భం ఒకటి నాకు తెలుసు.... నీకు తెలుసుకోవాలని వున్నాదా?' అని అడిగాడు.

'నాకు తెలుసుకోవాలని వున్నది గానీ నువు తెలియజెప్పగలవన్న నమ్మకం ఏమున్నాది? అదలా వుంచితే నాకు వినాలని వున్నది... చెప్పు...." అన్నాను నేను.

'అంటే వినడం వేరనీ, విని తెలుసుకోవడం వేరనీ నీకు తెలుసన్న మాట...'

'అవును, అంతేకాదు.. చెప్పడం వేరు, తెలియజెప్పడం వేరని కూడా నాకు తెలుసు...'

కింపురుషుడు నా భుజం మీద చెయ్యి వేసి తమ్ముడా... నువు అజ్ఞానాన్ని గుర్తించగలిగినట్టే నేను జ్ఞానాన్ని గుర్తించగలనని తెలుసుకో.. నువు ఎదుటి వారిలో నీ మూర్తిత్వాన్ని గుర్తించగలిగినట్టు, ఎదుటివారిలో నా ప్రతిబింబాన్ని చూడగలను... ఈ రెండు శక్తులూ జ్ఞానానికి బొమ్మా బొరుసూ లాంటివి.. ఒక వ్యక్తి అజ్ఞానం వల్ల అనేకులకు దుఃఖం కలిగిన సందర్భాన్ని వివరించే కథ ముందు విను –

## కొమ్ముల కుందేలు కథ

'పూర్వం ఒకానొకప్పుడు కింపురుషుల రాజ్యాన్ని మా ముత్తాతగారు పరిపాలించే కాలంలో నల్లగొండ అడవుల్లో కొన్ని కుందేళ్ళు కాపురం వుండేవి. వాటికి ఒక రాజు కూడా వుండేవాడు. అతను తన కుందేటి ప్రజల్ని బాగా అభిమానించేవాడు. రోజుకు రెండో మూడో కుందేళ్ళను ఏ క్రూరమృగమో పట్టేసుకుంటే ఆయన

చాలా బాధపడేవాడు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారంగా కొంత పచ్చిక భూమిని కేటాయించేవాడు. క్రూర మృగాల సంచారాన్ని కనిపెట్టి కుందేళ్ళని హెచ్చరించడానికి గూఢచార వ్యవస్థను ఏర్పాటు చేశాడు.

కుందేళ్ళు  మామూలుగా తిరిగే భూమి సమస్తమూ యుద్ధ రంగమేనని భావించి ఆత్మరక్షణ కోసం బొరియలు తవ్వించి, పారిపోవడానికి రహస్య సొరంగాలు ఏర్పాటు చేయించాడు

ప్రజలను ప్రేమించి, వారి క్షేమం కోసం వన దేవతకు ప్రత్యక్ష పూజలు చేయించాడు.

అయితే ఏ పెద్దనక్కో, ఏ చిరుతపులో, ఏ జాగిలమో ప్రతి రోజూ నాలుగైదు కుందేళ్ళని ఎత్తుకుపోయేవి. ఎంత ప్రయత్నించినా జనక్షయం తగ్గలేదు.

దానితో ఆ కుందేటి రాజు విసిగిపోయి, ఒక బొరియలో కూర్చుని వన దేవత కోసం ఘోరమైన తపస్సు చేశాడు. చివరకు వన దేవత ప్రత్యక్షమైంది.

"కుందేటి రాజా ఏమినీ కోరిక?" అన్నది.

'తల్లీ నా ప్రజలను క్రూర మృగాలనుంచి రక్షించుకోవటం నా బాధ్యత. అందువల్ల నేను కోరుకున్న వరం నువు ప్రసాదించాలి. మాకు సింహాలకుండే కోరలు కావాలి. మొసలికుండే దవడలు కావాలి. ఏనుగులకుండే దంతాలు కావాలి. ఖడ్గ మృగానికుండే కొమ్ము కావాలి..' అని కుందేటి రాజు కోరేడు.

'రాజా నీ ఆశయం మంచిదే.. ప్రజల మీద నీకున్న మమకారం నాకు సంతోషం కలిగిస్తోంది. నువు జాగ్రత్తగా ఆలోచించే ఈ వరం కోరుతున్నావా?' అని వన దేవత నిదానంగా అడిగింది.

'తల్లీ నేను అన్నీ ఆలోచించుకునే అడుగుతున్నాను. నా కోరిక నెరవేర్చు...'

'మరోసారి ఆలోచించుకో నాయనా.. కావాలంటే మిమ్మల్నందర్నీ సింహాలుగా మార్చేస్తాను...' అన్నది వనదేవత.

'లేదు తల్లీ.. మేము కుందేళ్ళుగానే వుంటాము... మమ్మల్ని మేము రక్షించుకోవడం కోసం నేను వరాలు అడిగాను. నీకు చాతనైతే అవి ప్రసాదించు...' అన్నాడు కుందేలు రాజు.

వన దేవత వంగి కుందేటి రాజు శిరస్సు మీద చేయివేసి

'నాయనా నువ్వడిగినవన్నీ నీ ఒక్కడికి ప్రసాదిస్తే సరిపోతుంది గదా...' అన్నది.

'లేదు తల్లీ.. లేదు.. నా సమస్త కుందేటి రాజ్యంలోని కుందేళ్ళన్నిటికీ కొమ్ములు కావాలి, దంతాలు కావాలి, కోరలు కావాలి... కావాల్సిందే అని కుందేటి రాజు పట్టుబట్టాడు.

'ఇది నీ కోరికేగదా... నీ ప్రజలు ఈ వరం కోరుకోలేదు గదా.. అసలు నువు నీ ప్రజల్ని సంప్రదించి ఈ వరాలు కోరినావా? అని వన దేవత స్త్రీ సహజమైన ఆరాలు తీసింది.

కుందేటి రాజుకు కోపం వచ్చింది.

'ఓ తల్లీ... నా ప్రజల రక్షణ బాధ్యత నాది.. కేవలం నా ఒక్కడిది.. వాళ్ళ శ్రేయస్సుకు ఏది మంచిదో నిర్ణయించే బాధ్యత నాకున్నది... వాళ్ళకు ఇష్టం లేకపోయినా, వాళ్ళను రక్షించి తీరాల్సిందే.. నేడిగిన వరం ఇస్తే ఇవ్వు, లేకపోతే మానీ గానీ నా రాజ్యపాలనా వ్యవహారాల్లో దయచేసి జోక్యం చూసుకోవద్దు..' అని అతను వన దేవతపై చిరాకుపడ్డాడు.

వన దేవత మారు మాట్లాడకుండా ఆశీర్వదించి మాయం అయిపోయింది.

మరుక్షణంలో కుందేటి రాజు నెత్తిమీద బారెడు పొడుగున్న కొమ్ము మొలిచింది అది పదును పెట్టిన కత్తిలాగున్నది. దాని నోటిలోంచి ఏనుగు దంతాల మాదిరి రెండు దంతాలు పొడుచుకొచ్చాయి. అవి కూడా కత్తుల్లాగా పదునుగా వున్నాయి. దాని పళ్ళు మొసలి పళ్ళ మాదిరిగా తయారైపోయాయి. వాటిలో కొన్ని సింహపు కోరల్లాగ మారిపోయాయి.

కుందేటి రాజు ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.

స్వస్తి!

నా జాతిపై క్రూర మృగాల దాష్టీకానికి ఇంతటితో స్వస్తి! అనుకుంటూ అది బొరియలోంచి బైటకివచ్చింది.

వచ్చీ రాగానే దాని మీద ఒక పొట్టి నక్క దాడిచేసింది.

కుందేటి రాజు తన కొమ్ముతో పొట్టినక్క డొక్కలో పొడిచింది.

కుందేలనే ప్రాణి పుట్టిన తరువాత ఇలాంటి సంఘటన జరగడం ప్రప్రథమం అనే సంగతి స్ఫురించి ఆ కుందేటి రాజు మహా ఆనందంగా తన నివాసానికి చేరుకున్నాడు.

అప్పటికే అక్కడికి మిగిలిన కుందేళ్ళన్నీ చేరుకున్నాయి.

అన్నిటికీ కొమ్ములూ, దంతాలూ, కోరలూ వున్నాయి. వాటికి వన దేవత వరం సంగతి తెలియకపోవడం చేత అవన్నీ చాలా ఆశ్చర్యంతో వున్నాయి.

వాటిని ఉద్దేశించి కుందేటిరాజు గొప్ప ఉపన్యాసం చేసేడు.

కుందేళ్ళన్నీ రాజుని పొగిడి, ఆనందంగా తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయాయి. ఆ రోజు సాయంత్రం వరకూ అవన్నీ ఆనందోత్సాహాలతో ఆకలిదప్పులు మరిచిపోయాయి.

సాయంత్రం వరకు ఒక్క కుందేలు కూడా క్రూర జంతువు పాలుపడలేదు.

సాయంత్రం అయి, వెన్నెల కురిసే సరికి వాటికి ఆకలేసి ఇవాల్టి నుంచీ నిర్భయంగా మేతకు పోవచ్చుగదా అని నిర్భయంగా అవి గడ్డి బయిలుకు చేరుకున్నాయి. అయితే తమ దంతాలతో, కోరలతో వెనుకటిలాగ పచ్చగడ్డి, మొక్కల చిగుర్లు తినడం సాధ్యం కాదని వాటికి ఆకస్మికంగా తెలిసింది.

తెలిసే సరికి అవన్నీ బావురుమన్నాయి. వాటికి దిక్కుతోచక రాజు గారి దగ్గరకు హాహాకారాలు చేసుకుంటూ వెళ్ళాయి.

రాజుగారు కూడా ఆ సమయానికి అదే విషయం గ్రహించినవాడై కొంత కంగారుగా వున్నాడు.

'మరేం ఫర్వాలేదు.. కొత్తగాబట్టి ఇలా వుందిగానీ, కొంత అభ్యాసం మీద మనకి బోయినం చేయటం అదే అలవాటు అవుతుంది....' అనేసి వాళ్ళని పంపించేశాడు.

కుందేళ్ళు నానా రకాలుగా పచ్చిగడ్డి తినడానికి ప్రయత్నాలు చేశాయి. కానీ కాలువలో నీళ్ళు త్రాగడం తప్ప అవి ఇంకేమీ చేయలేకపోయాయి.

ఆ రాత్రి అవన్నీ పస్తుపడుకున్నాయి. పొద్దున్నే అవన్నీ రాజుగారి ఇంటికి వెళ్ళి –

'మనం క్రూర మృగాల మాదిరి మాంసం అన్నా తినాలి... లేదంటే ఆ వన దేవతనే బతిమాలుకుని ఈ కోరలనీ వొదిలించుకోవాలి తప్ప మరో మార్గం లేదని' రాజుకు విన్నవించుకున్నాయి.

'కుందేటి పుటక పుట్టి, మాంసం తినడం మన వల్ల కాదు.. ఈ కొమ్ములూ కోరలూ లేకపోతే మనం ఇది వరకు లాగే నానా క్రూరమృగాలకీ బలైపోతాం కాబట్టి ఆకలితో చస్తే చచ్చిపోతాం గానీ ఇంకో జంతువుకి ఆహారం గావడానికి వీల్లేదు......' అని రాజు ఖండితంగా చెప్పేసి తన గదిలోకి పోయి తలుపులు వేసుకున్నాడు.

మిగిలిన కుందేళ్ళన్నీ హాహాకారాలు చేశాయి. ఆకలితో, దుఃఖంతో,నిరాశతో అవి వారం రోజులపాటు బాధపడ్డాయి.

ఈ లోపుగాఒక ముసలి కుందేలు ఘోరమైన తపస్సు చేసింది. వన దేవత ప్రత్యక్షం కాగా –

'తల్లీ.... మా రాజు మూర్ఖుడై ఈ వరం కోరేడు. దయచేసి ఈ కోరలన్నీ తీసేసి, మమ్మల్ని ఇది వరకు వలె మామూలు కుందేళ్ళుగా మార్చు. మా జనం బోయినం చేసి వారం రోజులయింది. ఆకలితో అందరం చచ్చేకన్నా, రోజుకో నలుగురు లెక్కన నక్కల వాతబడి నెమ్మదిగా చావడం మేలు' అని వేడుకుంది.

దానికి వన దేవత ఒప్పుకోలేదు. 'మీ రాజుకి యిచ్చిన వరం వుపసంహరించుకుంటే నా పరువేం కావాలి? మిగిలిన దేవతల దగ్గర నాకు ఎంత చిన్నతనంగా వుంటుంది? ప్రపంచంలో యిప్పటికి ఏ దేవతా ఇచ్చిన వరాన్ని ఉపసంహరించుకోలేదు... నేనుమాత్రం ఎలా చేస్తాను చెప్పు' అని వనదేవత అడిగింది.

'మరైతే మేమందరం ఇలా ఆకలితో చావాల్సిందేనా?' అని ఆ ముసలి కుందేలు అడిగింది.

'మీ రాజు బతికినంతకాలం నా వరం ప్రభావం చూపుతుంది అంతవరకు మీరు ఏం చేస్తారో మీ యిష్టం. ఈ విషయంలో నేనేమీ చేయలేను. ఇంకేదైనా వరం కావాలంటే కోరుకో.. తక్షణమే యిస్తాను' అన్నది వనదేవత.

ముసలి కుందేలు వన దేవత వంక కోపంగా చూసి, అక్కడ నుంచి వచ్చి తన బొరియలో కూర్చుని ఆలోచన చేసింది.

తెల్లవారేటప్పటికి దానికి ఒక ఉపాయం తోచింది. మిగిలిన కుందేళ్ళను సమావేశపరిచి, –

'మన రాజు బతికుండగా మనకి ఆకలి చావు తప్ప వేరే గత్యంతరం లేదు.... ఇంతమంది చావడం కంటే ఒక్కడు, వాడు రాజు అయినా చివరికి దేవుడైనా సరే చావడం మంచిది. పదండి రాజుని చంపి పీడ వొదుల్చుకుందాం' అని చెప్పింది.

అప్పుడు ఆకలితో వున్న ఆ కుందేళ్ళన్నీ రాజుమీద దాడిచేసి తమ కొమ్ములతో రాజుని పొడిచి చంపేశాయి. రాజు చచ్చిపోయిన వెంటనే కుందేళ్ళ కొమ్ములన్నీ మాయం అయిపోయాయి. అవి ఉత్సాహంగా పచ్చిక బయలుమీద పడి ఆకలి తీర్చుకున్నాయి.

అని ఆ కింపురుషుడు కథ ముగించాడు.

'నేను నీకు చెప్పిన లెక్కల తాబేలు కథకి, ఈ కొమ్ముల కుందేలు కథ అనుకరణ అని నా అనుమానం... దానికీ, దీనికీ తేడా ఏమున్నది గనుక' అని నేను నిర్మొహమాటంగా ఆ కింపురుషుడ్ని అడిగాను.

'జాగ్రత్తగ ఆలోచించి చూస్తే నీకు తేడా తెలుస్తుంది. లెక్కల తాబేలు మూర్ఖత్వం వల్ల రెక్కల తాబేళ్ళు నాశనం అయిపోలేదు. ఆ మూర్ఖుడి మాట విని, ఆ మూర్ఖుడు చెప్పినట్టు చేయడం వల్ల రెక్కల తాబేళ్ళన్నీ సర్వనాశనం అయిపోయాయి. నేను చెప్పిన కథలో కొమ్ముల కుందేలు పీడ వొదిలించుకుని తక్కిన కుందేళ్ళన్నీ బాగుపడ్డాయి. బోధపడిందా?" అని కింపురుషుడు ప్రశాంతంగా అడిగాడు.

"బోధపడిందిగానీ, నువ్వు చెప్పిన మాట మంచిదే అయినా ఒప్పుకోవలసిన అవసరం ఏమున్నదని ఆలోచిస్తున్నాను' అన్నాను నేను నిజాయితీగా.

'నీతో మరి కాసేపు మాటాడే వాడినే గానీ విప్పపువ్వులు అయిపోయాయి..... మళ్ళీ ఎప్పుడైనా నేను యిటు వచ్చినపుడు తప్పకుండా కాసేపు మాటాడుకుందాం....' అనేసి ఆ కింపురుషుడు నెమలి మీది కూచుని ఎగిరి పోయాడు.

నేను ఇంటికి పోయి సీతాకోక చిలుక రెక్కలతో తయారుచేసిన పుస్తకం అందుకుని నిద్దరొచ్చే వరకు రాసి పడుకున్నాను

నాకు మరుసటి రోజు మెలకువ వచ్చేసరికి మా మేనమామ నా ఆత్మకథ చదువుతూ కనిపించేడు.

నేను ఏమీ అనలేదు. కాసేపట్లో మా మేనమామ నే రాసిందంతా చదివి –

'బాగానే వున్నాది. కానీ మీ తాబేటి రాజూ, కుందేటి రాజూ నమ్మశక్యంగా లేరు. రాజులు ఎప్పుడూ

దుర్మార్గంగా వుంటారు. లేదా పరమదొంగలుగా వుంటారు. కానీ మూర్ఖంగా వుండరు. అసలు మూర్ఖులు రాజులు కాలేరు. ఈ విషయం నీకు బోధపడటం కోసం ఒక కథ చెప్పేదా?' అని అడిగాడు.

'నువ్వు చెప్పే కథ వినడానికి నేను సిద్ధంగా వున్నప్పుడు నేను చెప్పే కథ వినడానికి నువ్వు కూడా సిద్ధంగా వుండాలని నేను నీకు వేరే చెప్పక్కర్లేదుగదా' అన్నాన్నేను.

'ముందు నా కథ విను' అని మా మేనమామ ఈ కథ చెప్పేడు.

## తెల్ల కాకుల కథ

'ఇప్పుడు బంగాళాఖాతం వున్న దగ్గర పూర్వం ఒకపెద్ద అరణ్యం వుండేది. అందులో గంధర్వులూ, కింపురుషులూ, దెయ్యాలూ, పిశాచాలూ, రకరకాల పక్షులూ, జంతువులూ కూడా వుండేవి. అక్కడే తెల్లని కాకులు అనేకం నివసిస్తుండేవి. ఆ కాకులు ఓ రోజు మీటింగు పెట్టుకుని మనకొక రాజుండాల.. కాకపోతే మిగిలిన ప్రాణుల దగ్గర లోకువైపోతాం గదా అని ఆలోచించుకున్నాయి.

అప్పుడా కాకుల్లోంచి ఒకటి ముందుకొచ్చి....

'నేను మహా వీరుడ్నని మీకందరికి తెలుసు కదా. నా ధైర్య సాహసాలు కూడా మీకందరికీ తెలుసు. ఒక రాజుకు వుండవలసిన లక్షణాలన్నీ నాకు పుష్కలంగా వున్నాయి. కాబట్టి నన్ను రాజుగా ఎంచుకోండి' అని కోరింది.

ఆ తెల్లకాకుల్లో ముసలి కాకులు కొన్ని కలిసి కాసేపు చర్చించుకున్నాయి. ఆ తర్వాత.

"నువు చెప్పింది నిజమే కానీ మనం తెల్లగానే వున్నప్పటికీ ప్రధానంగా కాకులమని మరిచి పోకూడదు. అవునా? మన కాకులకు ధైర్య సాహసాలూ, పౌరుషాలూ, శౌర్య ప్రతాపాలూ అవసరమా? వాటితో మనకు ఎన్నడైనా పనిబడుతుందా? నువ్వే ఆలోచించు' అని సుబ్బరంగా తేల్చేశాయి.

మరో కాకి ముందుకు వచ్చి...

'తాతలారా, తండ్రులారా.. నాకంటే పెద్దలారా! మన తెల్లకాకులకి రాజుగా వుండే అర్హత నాకున్నదేమో పరిశీలించండి. నేను ధర్మశాస్త్రాలూ, నీతి శాస్త్రమూ బాగా చదువుకున్న కాకిని. రాజనీతిని ప్రత్యేక శ్రద్ధతో అభ్యసించిన దానిని. నన్ను రాజుని చేస్తే మన తెల్లకాకులన్నీ సుఖసంతోషాలతో బతుకుతాయని నా నమ్మకం' అని చెప్పింది.

మళ్ళీ ముసలి కాకులు చర్చలు జరిపి....

'నువు కూడా పనికిరావని మా అభిప్రాయం. కారణమేమిటంటే మనకు నీతి శాస్త్రంతో పనేముంది. మన దైనందిన జీవితంలో నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం ఎందుకు పనికొస్తాయి? ఇంక రాజనీతి సంగతి, ముందు మనకు తగిన రాజు కావాలి. ఆ రాజుకి నీతి కావాలి అవునా? మన తెల్ల కాకులకు రాజుగా వుండాలంటే వేరే అర్హతలుండాలి. అవి ప్రధానం. ఆ అర్హతలున్నవాడికి, నువ్వు సలహాదారుగా పనికిరావచ్చు. రాజుగా మన కులానికి సహాయ పడదామని నువు ప్రయత్నించి నందుకు సంతోషం' అని తేల్చాయి.

అప్పుడు ఆ ముసలి కాకుల్లోని ఒక తెల్లకాకి ముందుకు ఒక అడుగు వేసి...

'నా సంగతి అందరికీ తెలుసు. నేను ఎప్పుడూ అసత్యమాడి ఎరుగను. ఎవరికీ హాని చేసి ఎరుగను. అవినీతి గానీ, బంధుప్రీతి గానీ, అన్యాయం కానీ నాకు గిట్టని విషయాలు. నన్ను రాజుగా చేసుకుంటే మన తెల్లకాకుల ప్రతిష్ట పెరుగుతుందని భావిస్తున్నాను. నా విశిష్టత గురించి నేను చెప్పుకోవడం తప్పేగానీ, ఇలాంటి సందర్భాలలో దోషం లేదు. ఆలోచించి చూడండి' అన్నది.

'నువ్వంటే మన యావన్మంది కాకులకు ప్రేమాభిమానాలున్నాయి. కానీ నువ్వు రాజుగా పనికిరావు. నీకా అర్హత లేదని కూడా నీకు తెలుసు....' అన్నాయి మిగిలిన కాకులన్నీ.

'ఇలా నువ్వు పనికిరావు, నువు పనికిరావు అని అందర్నీ అవమానించే బదులు... రాజుగా వుండాలంటే ఏ అర్హతలుండాలో చెప్పరాదా?" అని ఆ మంచి కాకి నిష్ఠూరంగా అడిగింది.

'అర్హత లేమిటో చెప్పాలంటే చెప్పవచ్చు. కానీ దానివల్ల ప్రయోజనం లేదు. మనలో వున్న కాకుల్లో ఎవరు రాజుగా వుండటానికి అర్హులో నిర్ణయించుకోవడం సులువైన పని, తెలివైన పని' అని ముసలి కాకులు అన్నాయి.

మిగిలిన కాకుల్లో చాలా వాటికి రాజు కావాలని వున్నది. కానీ తీరా మనసులోని కోరికను బైటపెడితే ఏమవుతుందోనని జంకి వూరుకున్నాయి.

ఎవరూ ముందుకు రాకపోయేసరికి ముసలి కాకులు ఆలోచించి...

'మనం వనదేవతను ప్రార్థిద్దాం. రాజుని ఎంచే బాధ్యత ఆవిడకే వదిలి పెడదాం' అని ప్రతిపాదించాయి.

అప్పుడు మొత్తం తెల్లకాకులన్నీ పావుగంట వనదేవతను ప్రార్థించేసరికి ఆవిడ ప్రత్యక్షం అయింది.

'మీ కోరిక నాకు అర్థం అయింది. ఎవరు రాజుగా వుండటానికి యోగ్యులో మీరు నిర్ణయించ లేకపోయినప్పటికీ ఎవరు అర్హులు కాదో ఖచ్చితంగా నిర్ణయించినందుకు, గ్రహించినందుకు సంతోషిస్తున్నాను. మీరు కాకులు... మీకు రాజు కావాల్సిన వాడికి కాకులకు రాజు కావాల్సిన అర్హతలుండాలి... అంటే మీ నైజానికీ, మీ జీవన విధానానికీ తగినవాడే రాజు కాగలడు.. నే చెప్తాను వినండి.. మీరు ఎలా బతుకుతారు? మీ ప్రధాన వృత్తి ఆహారాన్ని దొంగిలించడం. అంటే దొంగతనంగా ఆహారాన్ని సంపాదించడంలో ఎవరైతే ఎక్కువ నైపుణ్యం కలిగివుంటారో వాడే మీకు రాజు. ఈ నైపుణ్యం వున్న కాకికి ఎదుటి వారిని ఏమార్చే శక్తి పుష్కలంగా వుండాలి. నిరాసక్తంగా వున్నట్టు, ఆహారం గురించి తలపే లేనట్టు, కాకతాళీయంగా అక్కడికి వచ్చినట్లు నటించగలిగే నైపుణ్యం వుండాలి. మెరుపువేగంతో ఆహారాన్ని తన్నుకుపోగల శక్తి సామర్థ్యాలుండాలి..... అట్టి శక్తి ఎవరికి వుందో చూసి అతడ్ని రాజుగా ఎంచుకోండి...' అన్నది వనదేవత.

అప్పటికే తెల్ల కాకులన్నీ ఒకనొక తెల్లకాకివైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

వనదేవత చెప్పిన లక్షణాలన్నీ ఆ కాకిలో పుష్కలంగా వున్నాయి. అది తాను తినడమే కాకుండా ఇతరకాకులకు తిండి ఎక్కడ దొరుకుతుందో చెపుతుంటుంది కూడా. యక్షులనుంచో, గంధర్వులనుంచో, దెయ్యాల చేతినుంచో, అది ఆహారాన్ని తన్నుకుపోయినపుడు అవి ఏ రాళ్ళో విసిరి కొట్టడానికి చాలా ప్రయత్నించాయి గానీ ఆ కాకి ఎన్నడూ దెబ్బలు తినలేదు.

మిగిలిన అన్ని కాకులూ తననే చూస్తుంటే ఆ కాకికి కొంత సిగ్గేసింది. అది పదవిమీద మోజు లేనే లేనట్టు మొహం అమాయకంగా, నిరాసక్తంగా పెట్టి తల వంచుకున్నది.

వన దేవత వేలెత్తి ఆ కాకిని చూపించి.

'అదిగో ఆ కాకే మీ రాజు... పరమ దొంగ, కిలాడీ, మాయలాడి, కాకులకే అది కాకి! పరమ కాకి!! దానిని మీరు రాజుగా చేసుకొని హాయిగా వర్ధిల్లండి..' అనేసి ఆ వనదేవత మాయమైపోయింది.

ఆ వెంటనే ఆ కాకులన్నీ వనదేవత ఎంచిన కాకిని రాజుగా చేసుకున్నాయి. దాని సారథ్యంలో అవి ఎన్నడూ కూటికీ, గూటికీ బాధపడలేదు' అని మా మేనమామ కథ పూర్తిచేశాడు. నేను పాచినోటితో నవ్వాను.

ఎందుకు నవ్వుతావని మా మామయ్య అనుమానంగా అడిగాడు.

'కాకులు తోటి కాకిని రాజుగా చేసుకున్నప్పుడు, మూర్ఖులు తోటి మూర్ఖుల్ని ఎందుకు రాజుగా ఎంచుకోకూడదో నాకు అర్థం కాక నవ్వేను. ఏమీ అనుకోవద్దన్నాను.

మా మేనమావకి నా వెక్కిరింత అర్థమై కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

'మావయ్యా.... ఒక మూర్ఖుడ్ని రాజుగా ఎంచుకోవాల్సిన సందర్భాలు కూడా కొందరికి, కొన్ని చోట్ల తారసపడతాయని నీకు తెలియడానికి వీలుగా ఒక కథ చెబుతాను విను.

## ఈకల గబ్బిలాల కథ

పూర్వం నేను మూడోనెల పసి దెయ్యంగా వున్న రోజుల్లో మూసీనది తీరంలో ఒక అడవి వుండేది. అందులో ఒక మర్రిచెట్టు కింద దేవతలు తపస్సు చేసుకుంటూ వుండేవారు. ఆ చెట్టుమీద అనేక గబ్బిలాలు సుఖంగా జీవిస్తూ వుండేవి. అవి వికారంగా వుండటంవల్లనో, తినడానికి పనికి రాకపోవడం వల్లనో వాటి జోలికి ఎవరూ వచ్చేవారు కాదు. ఆ చెట్టు మీద కాపురం వుండే పావురాలూ, చిలుకలూ, మైనగోరలూ ఎప్పుడూ ఏదో ఒక క్రూరజంతువు బారిన పడి చచ్చిపోతుండేవి కానీ గబ్బిలాలు సుఖంగా వుండేవి.

దాంతో వాటికి గుడ్డి కళ్ళు నెత్తిమీదికి ఎక్కిపోయినాయి. అవి పగలంతా దర్జాగా పడుకొని రాత్రిపూట లేచి, నిర్భయంగా మర్రిపళ్ళు తింటూ కాలక్షేపం చేసేవి.

వాటిలో ఒకానొక గబ్బిలానికి పెంకి గబ్బిలం అనే పేరుండేది. ఆ పెంకి గబ్బిలం మెలకువగా వున్నంతసేపూ ఇతర గబ్బిలాలను ఆట పట్టిస్తుండేది. సూర్యోదయం కాగానే ఇతర గబ్బిలాలన్నీ నిద్రపోతున్నపుడు వాటి కలల్లోకి వెళ్ళి మరీ అల్లరి పెట్టేది.

ఓ రోజు పెంకి గబ్బిలం సుబ్బరంగా ఓ పది మర్రిపళ్ళు తిని అవి అరగడం కోసం ఇటు, అటు ఎగరడం మొదలెట్టింది. ఆ చెట్టుకింద తపస్సు చేసుకుంటున్న ఒక దేవముని గడ్డాన్ని కాలితో పట్టుకుని దాన్నుంచి తలకిందులుగా వేళ్ళాడ్డం మొదలుపెట్టింది.

ఆ దేవముని కళ్ళు తెరిచి, 'నువు చెట్టు కొమ్మల్నించి వేలాడాలి కానీ ఇలా తాపసుల గెడ్డాలు పట్టుకొని వేలాడకూడదు... తప్పు' అని ప్రశాంతంగా చెప్పాడు.

పెంకి గబ్బిలం నవ్వింది.

'నాయినా నువు కళ్ళు మూసుకొని తపస్సు చేసుకో... నా కిక్కడే బాగుంది... నన్ను అల్లరి పెట్టకు' అని అది అల్లరిగా ఆ దేవమునికి చెప్పింది.

'తప్పు.... నేను తపస్సు చేసుకుంటున్నాను... నన్ను చిరాకుపెట్టి, నా తపస్సుకి భంగం కలిగించకూడదు....' అని ఆ దేవముని ప్రశాంతంగానే చెప్పాడు.

'నువు తపస్సు ఎందుకు చేస్తున్నావు? ఏదో వరం కోసమే గదా! ఆ వరం ఏదో నన్నే అడుగు.. ఇస్తాను కదా...' అన్నది ఆ పెంకి గబ్బిలం.

ఆ దేవమునికి పిసరంత కోపం వచ్చింది.

'నువు మర్యాదా, మప్పితం లేకుండా మాటాడుతున్నావు. ఉచితానుచితాలు తెలియకుండా ప్రవర్తిస్తున్నావు... ఇది మంచి పద్ధతి కాదు...' అని నచ్చచెప్పాలని చూశాడు

పెంకి గబ్బిలం ఆ దేవముని గడ్డం పుచ్చుకుని మరింత గట్టిగా కాళ్ళతో లాగి

'నువు నోరూ, కళ్లూ మూసుకొని తపస్సు చేసుకో... నీతో నేను మాటాడదలుచుకోలేదు. నువు కూడా నాతో మాటాడకు....' అని కసిరింది.

దానితో ఆ దేవమునికి కోపం వచ్చేసింది.

'ఈ క్షణం నుంచీ మీ గబ్బిలాలన్నింటికీ రంగు రంగుల ఈకలు మొలవాలని శపిస్తున్నాను... నీ అహంకారానికి అదే శిక్ష...' అని శాపం పెట్టి ఆ దేవముని ఆ పెంకి గబ్బిలాన్ని లాగి విసిరేసి వెళ్ళిపోయాడు.

మరుక్షణమే ఆ చెట్టుమీదున్న గబ్బిలాలన్నింటికీ రంగు రంగుల ఈకలు మొలిచాయి.

గబ్బిలాలకు కళ్ళు కనిపించవు కాబట్టి, అవి ఎంత అందంగా తయారైనాయో వాటికి అర్థం కాలేదు. కానీ ఆ చెట్టుమీదున్న మిగిలిన పక్షులు వాటికి ఆ సంగతి చెప్పాయి.

'ఇపుడు మీరు ఎంత అందంగా వున్నారో తెలుసునా? మీ అందాన్ని చూడటానికి మా రెండు కళ్ళూ చాలటం లేదు' అని పొగిడాయి.

మొత్తం గబ్బిలాలన్నీ పొంగిపోయాయి. అవి ఆనందాతిశయంతో పగలు కూడా ఇటు అటు ఎగిరాయి. ఆ రాత్రి వాటి హుషారుకి హద్దులే లేకపోయాయి.

అయితే మరుసటి రోజు పొద్దున్న వాటికి ఎన్నడూ లేని ఆపద మొదలైంది.

గబ్బిలాలు తినడానికి పనికిరాకపోయినా, వాటి వంటి మీదున్న రంగు రంగుల ఈకలు ఎంతో ముద్దొస్తున్నాయని గమనించి కొండయక్షులు ఆ చెట్టుమీద పడ్డారు.

ఆ ఒక్కపూటే వాళ్ళు ఇరవై గబ్బిలాల్ని చంపేసి, వాటి ఈకల్ని పీకేసి పట్టుకుపోయారు.

మరుసటి రోజున కూడా అదే విధంగా జరిగి మరో పది గబ్బిలాలు చచ్చిపోయాయి.

పెంకి గబ్బిలం భయపడిపోయి, దేవముని శాపం గురించి మిగిలిన గబ్బిలాలకి చెప్పేసింది.

అవన్నీ కలిసి, పెంకి గబ్బిలాన్ని నానా చివాట్లుపెట్టి, పోయి ఆ దేవమునికి క్షమాపణ చెప్పుకొని, శాప విమోచనం చేయించుకు రమ్మని గద్దించాయి.

పెంకి గబ్బిలం తన తప్పు గ్రహించి వేరే చెట్టు క్రింద తపస్సు చేసుకుంటున్న ఆ దేవముని దగ్గరకు పోయి.

'అయ్యా నన్ను క్షమించండి... బుద్ధి గడ్డి తిని అహంకరించాను. తమరి శాపంవల్ల మా గబ్బిలాలు ఉత్తిపుణ్యానికి చచ్చిపోతున్నాయి' అని ఏడుస్తూ చెప్పింది.

శాప విమోచనం చేయమని కోరింది.

ఆ దేవముని శాంతించి....

'అహంకారం అనర్థదాయకమని ఇప్పుడైనా తెలుసుకొని బుద్ధికలిగి జీవించు. శాప విమోచన జాగ్రత్తగా విను. ఏ క్షణంలో అయితే మీ గబ్బిలాలకు ఒక మూర్ఖుడు రాజు అవుతాడో అప్పుడే మీకు ఈ శాపం తొలిగి, ఈ ఈకలన్నీ మాయమౌతాయి... అంతవరకు జాగ్రత్తగా బతకాల్సిందే తప్ప చేయగలిగింది లేదు....' అని చెప్పేసి ఆ దేవముని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

పెంకి గబ్బిలం ఆ విషయం అంతా తోటి గబ్బిలాలకు చెప్పింది.

వెంటనే ఒక గబ్బిలం లేచి, అందరికీ నమస్కారం పెట్టి...

'నాకు చదువు లేదు, జ్ఞానం లేదు, సంస్కారం లేదు. నాకు ఏమీ తెలియదు. నేను మూర్ఖురాల్ని.. నన్ను తక్షణమే రాజుని చేసి, మన కులానికి కలిగిన ఆపద తొలగించండి'.. అన్నది.

మిగిలిన గబ్బిలాలన్నీ 'అది నిజమే' అని అంగీకరించి మూర్ఖ గబ్బిలాన్ని రాజుగా పట్టాభిషిక్తుడ్ని చేశాయి.

అయినా సరే ఆ ఈకలు పోలేదు.

పెంకి గబ్బిలం తక్షణమే శాపం పెట్టిన దేవమునిని ఆశ్రయించి...

'తండ్రీ! నీ మాట వమ్మయిపోయింది. మూర్ఖుడ్ని రాజుగా చేసినా మా ఈకలు అలాగే మిగిలిపోయాయి..' అన్నది.

ఆ దేవముని దివ్యదృష్టితో జరిగినదంతా గ్రహించి.

'తనకు ఏమీ తెలియదని గ్రహించినవాడు మూర్ఖుడు ఎలా అవుతాడు? బుర్ర తక్కువగా ప్రవర్తించి కాలాన్ని వ్యర్థం చేయకుండా వెళ్ళి నిజమైన మూర్ఖుడ్ని రాజుగా చేసుకోండి..' అనేసి ఆ దేవముని మళ్ళీ కళ్ళు మూసేసుకున్నాడు.

ఆ పెంకి గబ్బిలం ఈ సంగతి అంతా మిగిలిన గబ్బిలాలకు చెప్పింది.

ఆ సంగతి విని మిగిలిన గబ్బిలాలన్నీ నిరాశపడిపోయాయి.

'మీరు నిరాశపడకండి. మనలో నిజమైన మూర్ఖుడ్ని కనిబెట్టడం కష్టమైన పనే. మన గబ్బిలాల్లో మూర్ఖులు వుండటం అసాధ్యం కాబట్టి మన పని చాలా కష్టమైనదే. అయినా సరే గత్యంతరం లేదు కాబట్టి ఓపికగా వెతుకుదాం..' అని ఆ పెంకి గబ్బిలం తక్కిన వాటికి ధైర్యం చెప్పింది.

ఆ క్షణం నుంచీ అది మూర్ఖురాలైన గబ్బిలాన్ని కనిపెట్టడం కోసం శ్రద్ధగా వ్యవహరించడం మొదలు పెట్టింది. రాత్రీ, పగలూ అదే పని మీద వెతుకుతున్నా దానికి సంతృప్తి కలగడం లేదు. ఏ గబ్బిలంలో చూసినా బోలెడంత మూర్ఖత్వం వున్నది గానీ, అదే సమయాన కొంత జ్ఞానం కూడా కనిపిస్తున్నది.

రోజులు గడిచిపోతున్నా దానికి మూర్ఖ గబ్బిలం దొరకలేదు. ఈ లోపుగా మరో ఇరవై గబ్బిలాలు కొండ యక్షుల చేతిలో చచ్చిపోయాయి.

ఏం చేయాలో తోచక ఆ పెంకి గబ్బిలం మళ్ళీ దేవమునిని పట్టుకున్నది.

'తండ్రీ... నువ్వే మమ్మల్ని రక్షించాలి. మా గబ్బిలాల్లో నిజమైన మూర్ఖుడి కోసం నేను వారం రోజుల్నించి రాత్రీ, పగలూ వెతికాను గానీ దొరకలేదు..ఈ లోపుగా మా గబ్బిలాలు అన్యాయంగా చచ్చిపోతున్నాయి. నీవే దిక్కు.... ఏదైనా దారి చూపించు...' అని ఆ పెంకి గబ్బిలం దేవమునిని వేడుకున్నది.

దేవముని పకపక నవ్వేడు. 'మూర్ఖత్వం కోసం యిక్కడ, అక్కడా వెతికేవాడి కంటే మూర్ఖుడెవడయ్యా? వెళ్ళు, వెళ్ళి వెంటనే రాజ సింహాసనం మీద కూర్చుని నీ తోటి గబ్బిలాలకు శాపవిముక్తి కలిగించు...' అని అతడు దీవించి వెంటనే మళ్ళీ తపస్సులో లీనమై పోయాడు.

తక్కిన గబ్బిలాలన్నీ ఆలస్యం చేయకుండా పెంకి గబ్బిలాన్ని రాజుగా ప్రకటించాయి. మరుక్షణమే వాటి వంటి మీద రంగు రంగుల ఈకలన్నీ పీకేసినట్టు మాయం అయిపోయాయి. ఆ ఈకల మూలంగా వాటికి కలిగిన ఉపద్రవం కూడా నాటి నుంచీ అంతరించిపోయింది.

నేనీ కథ పూర్తిచేసేటప్పటికీ మా మేనమామ చాలా చిరాకు మీదున్నాడు.

'కథలతో జీవితాన్నీ, మనస్సునీ పెడదారి పట్టించవచ్చని నీకే కాదు ఈ లోకంలో చాలా మందికి తెలుసు. నువు నిన్నే ప్రాతిపదికగా చేసుకొని లోకాన్ని వెక్కిరిస్తున్నట్టు నాకు అనుమానంగా వుంది. నీలాంటి గజం బద్దగాళ్ళు కూడా ఈ లోకంలో చాలా మంది వున్నారు. వాళ్ళ గురించి తెలుసుకునే ఓపిక వుంటే చెప్పు.. దానికి సంబంధించిన ఒక కథ చెబుతాను...'అన్నాడు నాతో.

'నువు చెప్పిందే వేదం అనుకునే తత్వం నీకున్నదని నేను చాలాకాలం క్రితమే కనిబెట్టేను. అందుకనే నువు నీ దృక్పథం ఒక్కటే కాక, వేరే దృక్పథం కూడ వున్నదని ఎవరైనా చెపితే కోప్పడి పోతున్నావు. నేను నీలాగా సంకుచితంగా ఆలోచించేదాన్ని కాదు... నీకు ఇష్టమొచ్చిన కథ చెప్పు.. వినకపోతే అడుగు" అన్నాను.

మా మేనమామ కొంత పశ్చాత్తాప పడినట్టు మొగం పెట్టి ఈ కథ మొదలు పెట్టేడు.

## తోక పీతల కథ

‘ఒకానొక కాలంలో కృష్ణానదీ తీరంలోని ఒక కాలువగట్టు మీది పీతలకు పొడవైనతోక లుండేవి. అవి తమ తోకల్ని చూసుకుని పొంగిపోయేవి. తోకలేని ప్రాణులన్నీ వాటి కంటికి హీనంగా కనిపించేవి. తత్కారణంగా వాటికి సృష్టిలో తాము చాలా అధికులమన్న అతిశయభావం ఒకటి ఏర్పడింది.

అలాంటి పీతల కుటుంబంలో తోపీ అనే పేరుగల ఒక తోక పీత వుండేది. అది చాలా తెలివైనది. ఆ సంగతి కూడా దానికి తెలుసు. ఒక నాడది హఠాత్తుగా ఒక వెదురు బద్ద తీసుకొచ్చి తన తోక చివరనుంచి తన ముందరి కాళ్ల గోళ్ళ వరకు ఎంత పొడవుందో కొలిచి, ఆ మేరకు వెదురు బద్ద విరిచేసింది. ఆ వెదురు బద్దకు ‘తోపీ’ అనే నామకరణం చేసింది. తాను నివసిస్తున్న బొరియ దగ్గర నుంచి, కాలువలోని నీటి ఒడ్డు ఎంత దూరంలో వుందో ఆ వెదురు బద్దతో కొలిచి, తన ఇంటికి తొంభై అయిదు తోపీల దూరంలో ఒక కాలువ వుందని నిర్ధారించింది.

అక్కడితో ఆగకుండా కాలువ లోతును కూడా అదే రీతిగా కొలిచింది. తాము నిత్యమూ ఈదులాడే కాలువ తొమ్మిది వందల తోపీలలోతూ, పదిహేను వేల తోపీల వెడల్పూ కలిగి వుందని అది నిర్ధారించింది.

అయితే అదే కాలువ ఒడ్డున దాని కంటే ఎంతో పెద్ద పీతలూ, చాల చిన్న పీతలూ కూడా వున్నాయి. తోపీ వాటిని కలిసి తాను కనిపెట్టిన కొలమానాన్ని వివరించి కాలువ లోతు ఎంతో, వెడల్పెంతో నిర్ధారణగా చెప్పింది. తన తోపీ వాడమని సిఫార్సు చేసింది.

‘మేం నీకంటే చాలా పెద్ద.. నీకు దాదాపు అయిదు రెట్లు పొడవుగా వున్నాం గదా... నీ కొలమానం నీ పరిమాణానికి అనుకూలంగా వున్నది. నీకు తొమ్మిది వందల తోపీల లోతున్న కాలువ మాకు ఎనభై, తొంభై తోపీల కంటే ఎక్కువ రాదు. ఇలాంటప్పుడు నీ తోపీని మేం ఎందుకు వాడుకోవాలి.. మాక్కూడా వెదురు బద్దలూ అవీ దొరుకుతాయి. గద.. మేం మాత్రం నీపాటి తోపీ చేసుకోలేమా?’ అని అవి తోపీని ప్రశ్నించాయి.

‘మన లోకంలో ఈ రకమైన కొలమానాన్ని నేనే మొట్టమొదట కనిబెట్టేను గనుక నా గౌరవార్థం మీరందరూ నా తోపీనే వాడటం న్యాయం. ఒక్కో పీతా ఒక్కో కొలమానం వాడితే నిర్దిష్టమైన కొలతలు మనకి దొరకవు గదా... ఆలోచించండి. తెలివిగల తోటి పీతను గౌరవించడం వల్ల మన మర్యాదకు లోపమేమీ లేదు..’ అని నచ్చజెప్పాలని తోపీ ప్రయత్నించింది.

‘నీ తెలివి తేటల్ని మేం తప్పకుండా గౌరవిస్తున్నాం. కానీ అదే సమయంలో మా తెలివి తేటల్ని కూడా మేం గౌరవించుకోవాలిగదా? నీ గౌరవార్థం నువు కనిబెట్టిన పద్ధతిని అనుసరించి, స్వీయ గౌరవార్థం మా సొంత తోపీలు తయారు చేసుకుంటాం....’ అని మిగిలిన తోక పీతలన్నీ కుండబద్దలు కొట్టినట్టు చెప్పాయి.

తోపీ ఎంత బతిమాలినా, నిందించినా ప్రయోజనం లేకపోయింది. ప్రతి తోక పీతా ఒక వెదురు బద్దని జేబులో పెట్టుకొని తిరగడం మొదలు పెట్టింది.

కలుగు నుంచి కాలవొడ్డు దాకా వున్న దూరాన్ని అవి నిర్ధారించేయిగానీ, కలుగు నుంచి కాలవొడ్డుకు వున్న దూరానికీ, కాలువొడ్డు నుంచి కలుగుకున్న దూరానికీ తేడా వస్తున్నది.

అలాగే అటు నుంచి ఇటుగానీ, ఇటునుంచి అటుగానీ కొలిచిన దూరానికీ పొంతన కుదరటం లేదు. రెండ్రోజులు చూసి అవన్నీ తోపీ దగ్గరకు వెళ్ళాయి.

‘తోపీ తోపీ! నువు ఏవీ అనుకోకుండా మాకో సాయం చెయ్యాలి. నువు కనిపెట్టిన తోపీ పద్ధతి మాకందరికీ ఎంతో నచ్చిన సంగతి నీకు వేరే చెప్పక్కర్లేదు గదా, కానీ ఈ తోపీని వాడటం మాకు సరిగా వచ్చినట్టులేదు. లెక్కలు చాలా తేడా వస్తున్నాయి. కలుగునుంచి కాలువ ఎంత దూరంలో వుందో, కాలవ నుంచి కలుగు కూడా అంతే దూరంలో వుండాలి గదా.... కానీ మేం కొలుస్తుంటే అలాగ రావడం లేదు.

కారణం ఏమిటో మాకు అర్థం, కావడం లేదు. దయచేసి నువ్వు నేను తయారుచేసుకున్న నా సొంత తోపీతో ఈ దూరాలు కొల్చి నిర్ధారించవా?' అని ప్రతి ఒక్కటీ తోపీని బతిమాలాయి.

తనకు అవకాశం వచ్చింది గదా అని తోపీ బాగా సంతోషించి...

"మీరందరూ కృతఘ్నులు! అవకాశవాదులు! మీకు నా తెలివి తేటల మీద గౌరవం లేదు. నా అవసరం వున్నది కాబట్టి యిప్పుడు నా కాళ్ళా వేళ్ళా పడుతున్నారు, కానీ లేకపోతే ఖాతరు చేయరు. మీ లెక్కలు ఎందుకు తేడా వస్తున్నాయో నాకు తెలుసు కానీ నేనెందుకు చెప్పాలి? చెప్పేవరకు నన్ను బతిమాలి, చెప్పేసిం తర్వాత మళ్ళా నా మొహం చూడరు. నేను మీకు సాయం చెయ్యనుపొండి' అని కసిరి పారేసింది.

'నువ్వు అనవసరంగా తోటి తోక పీతల్ని కసిరేస్తున్నావు. నీ తెలివి తేటల్ని గౌరవించినందుకే గదా నీ దగ్గరికి ఒచ్చాం.. బాబ్బాబు... మాకీసాయం చెయ్యి... మా వెదురు బద్దలన్నిటికీ నీ పేరే పెట్టుకున్నాం గదా.. ఇంతకంటే గౌరవం ఏం కావాలి?' అని అవి మళ్ళీ బతిమాలేయి.

తోపీ ఆలోచనలో పడింది – మనం కసిరిపారేస్తే మనకొచ్చిన లాభం ఏమీ లేదు. వాళ్ళడిగింది చెపితే మనకు వచ్చిన నష్టంగానీ, అది తెలుసుకున్నందువల్ల వాటికి కలిగే ప్రయోజనం గానీ ఏమీలేదు. పది మందికీ చెడ్డ అయిపోవటం అనవసరం గదా అని ఆలోచించి.

'మరేం లేదు... మాట వరసకీ నా కలుగుకీ, మన కాలవ ఒడ్డుకీ పది తోపీల దూరం అని నేను అన్నాననుకోండి అది ఖచ్చితంగా అంతే దూరం వుంటుంది. లెక్క తప్పడానికి వీలులేదు. కాకపోతే ఒక విషయాన్ని దృష్టిలో వుంచుకోవాల్సి వుంటుంది. మనం మన పీత నడక మాని, తిన్నగా నడవాల్సి వుంటుంది. తిన్నగా నడవడం మన వల్ల కాదు గాబట్టి ఒకసారి కొలతకి, మరోసారి కొలతకి తేడా వస్తున్నది. అందువల్ల తిన్నగా నడిచి కొతలు తీసుకోండి.... ఇంక వెళ్ళిరండి..' అని వివరించి చెప్పింది తోపీ.

తోకపీతలన్నీ హాహాకారాలు చేశాయి. మా తరమా తోపీ? పీత పుటక పుట్టి తిన్నగా ఎలా నడవగలం? మా వల్లకాదు.. నీకుతెలిసి కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టడం న్యాయం కాదు...' అని అవి ప్రాధేయ పడ్డాయి.

మరి కాసేపు బతిమాలించుకున్నాక తోపీ ఒక ఉపాయాన్ని సూచించింది 'కలుగు దగ్గర ఒక వెదురు ముక్క పాతండి. కాలువ ఒడ్డున ఒక వెదురు ముక్క పాతండి. రెంటికీ కలిపి ఒక తాడు కట్టండి. ఈ కొనా, ఆ కొనా సరిగ్గా, చూసి, కలుగు దగ్గరే కూచుని మీమీ తోపీల్తో ఆ తాడు పొడవు కొలవండి... ఆ పొడవే ఆ దూరం అవుతుంది.

తోక పీతలన్నీ సలహా విని... 'ఈ సంగతి మాకు ముందే తెలుసు... నువ్వింకేదో వుపాయం చెబుతావనుకుని అడిగాముగానీ ఈ తాడు కొలత తెలియక కాదు.. అనేసి వెళ్ళిపోయాయి.

ఆ తర్వాత తోపీకి తోటి తోకపీతల మీద చాలా కోపం వచ్చింది. తన తెలివి తేటలన్నీ ఉపయోగించి అనేక కొత్త విషయాలు అది కనిపెట్టింది.

తన తలవైపు వున్న దిక్కుకి అది తూర్పు అని పేరు బెట్టింది. తన తోకవైపున్న దిక్కుకి అది పడమర అనీ, తన కుడిచేతి వేపున్న దిక్కుకి దక్షిణం అనీ, ఎడమ చేతివైపున్న దిక్కుకి ఉత్తరం అని పేరు పెట్టింది. మరి కాసేపటికి ఆ దిక్కులు తాను నడిచినప్పుడల్లా కదిలినపుడల్లా మారుతుంటాయని కూడా అది కనిబెట్టింది.

ఒకరోజు పొద్దున్నే లేచి చూసేసరికి సూర్యుడు తన వెనక వైపు నుంచి ఉదయిస్తున్నట్టు కనిపెట్టింది. సాయంత్రంవేళ సూర్యుడు తన ఎడమ చేతివైపు అస్తమిస్తున్నట్టు కనిపెట్టింది. అంటే సూర్యుడనే వాడు పశ్చిమ దిక్కున ఉదయించి, ఉత్తరం వైపున అస్తమిస్తున్నాడని క్షణాలమీద నిర్ధారణచేసింది గానీ, మరుసటిరోజు లేచి చూసేసరికి సూర్యుడు దక్షిణం వైపు ఉదయించి నట్టు తెలుసుకున్నాది. ఇలా నాలుగు రోజులు పరిశీలించి సూర్యుడు రోజుకో దిక్కున ఉదయిస్తాడని తేల్చుకుంది.

తెలివైన దాని బుర్రలో యింకో ఆలోచన ముసిరింది.

ఒక తోపీ పొడవున్న ఒక వెదురు కర్రని అది భూమిలో పాతి దాని నీడల్ని, యింకో తోపీతో కొలవడం మొదలుపెట్టింది. దాని ప్రకారం అది కాల విభజన కూడా చేసింది. దానికి వెదురు గడియారం అని పేరు పెట్టింది.

పొద్దున్న యిన్ని తోపీల వేళ కాలువకు వెళ్తాము. మధ్యాహ్నం యిన్ని తోపీల వేళప్పుడు భోయినం చేస్తాము. సాయంత్రం యిన్ని తోపీల వేళప్పుడు కాలువ నుంచి కలుగుకు తిరిగి వస్తాము అని నిర్ధారించింది.

తోటి తోక పీతలు రహస్యంగా తోపీని కనిబెడుతూనే వున్నాయి. తోపీ కాలాన్ని గణిస్తున్న పద్ధతిని అవి కనిబెట్టేశాయి.

మరో రెండు మూడురోజుల్లో కాలువ ఒడ్డు నిండా పీతకో తోపీలెక్కన వెదురు గడియారాలు తయారైనాయి.

తోపీకి పొద్దున్న నాలుగుతోపీల సమయానికి పెద్ద పీతల గడియారం రెండు తోపీలే చూపించేది. తోపీ కంటే చిన్న తోపీల గడియారంలో అయిదు తోపీలు అని తెలిసేది.

తన విలువైన ఆలోచనలు తన యావత్ తోక పీతల్ని ప్రభావితం చేస్తున్నట్టు గమనించి తోపీ దిక్కుల గురించీ, సూర్యుడు, చంద్రుడు ఏ రకంగా అస్తమిస్తారో, ఉదయిస్తారో కూడా చెప్పేసింది.

మరుసటిరోజు పొద్దున్న సూర్యుడు దక్షిణాన ఉదయించాడని తోపీ అంటే, మిగిలిన పీతలు ఒప్పుకోలేదు. కొన్ని పీతలు తూర్పున ఉదయించాడనీ, కొన్ని పీతలు సూర్యుడు ఉత్తరాన ఉదయించాడనీ వాదించాయి. కొన్నయితే పడమర దిక్కున సూర్యుడు ఉదయించాడని ఘంటాపథంగా చెప్పాయి. దానితో తోపీకి ఒళ్ళు మండిపోయింది. దగ్గరలో వున్న ఒక బండరాయి మీదకు పాకి అది యీ విధంగా ఉపన్యాసం చెప్పింది.

'తక్కుంగల పీతాలారా... నా కంటే అన్ని రకాలుగాను తక్కువైన పీతలారా.. మీ వరస నాకేమీ నచ్చలేదు... మన దేశంలోకి ఇపుడు పరదేశి ఎవరైనా వస్తే మన గురించి ఏమనుకుంటాడు? పీతకో కొలమానమా? పీతకో కాలమానమా? పీతకో దిక్కా? యిన్ని కొలతలతో, దిక్కులతో, కాలమానాలతో మనం ఎలాగ బతకగలం? కాబట్టి నా మాట వినండి ఇలాగ జాగ్రత్తగా నాకేసి చూడండి. నా తోక దగ్గర నుంచి నా గోటిదాకా వున్న పొడవే తోపీ అనే కొలబద్ద... దీనినే మీరందరూ వాడాలి. అప్పుడు యీ కంగాళీ వుండదు. అలాగే నా వెదురుగడియారాన్నిబట్టి, నా తోపీలనే మీరందరూ కాలాన్ని కొలవడానికి ఉపయోగించండి. అలాగే ఎటువైపు నా తల వుంటే అదే తూర్పు. నా వెనుక వున్నదే పడమర. అందరూ ఇదే గుర్తు పెట్టుకోండి. నా కాళ్ళకింద వున్నదాన్నే భూవి అనాలి. నా నెత్తిమీదున్నదే ఆకాశం... ఇలాగ మీరందరూ గుర్తు పెట్టుకుంటే మన బతుకులన్నీ సక్రమంగా వుంటాయి. మనల్ని చూసి ఎవరూ నవ్వరు. నా తెలివి తేటలు కూడా మీకందరికి పనికొస్తాయి. అజ్ఞానంతో నవ్వులపాలు కావద్దు."

ఈ ఉపన్యాసం విన్న మిగిలిన తోకపీతలన్నింటికీ ఒళ్ళెరగనంత కోపం వచ్చింది. అందులో ఒక ముసలి పీత ఆ రాతి మీదెక్కి....

'నేను పుట్టి ఆరు ఆదివారాలైపోయింది. ఇంత దీర్ఘమైన నా జీవిత కాలంలో ఈ తోపీలాంటి అహంకారినీ, అతిశయ జీవినీ ఎన్నడూ చూడలేదు. అన్నిటికీ తానే కేంద్రమనీ, కొలబద్దనని అది భావిస్తోంది. హాయిగా ఆడుతూ, పాడుతూ తిరిగే పీతల్ని అనవసరమైన పనుల్లోకి దింపి నానా కంగాళీ చేసిన ఈ తోపీని పట్టుకు చితక తన్నాలని ప్రతిపాదిస్తున్నాను. ముందు తాపు నేనే తంతున్నాను" అని ఆ ముసలి పీత ప్రసంగించి లాగి తోపీని నేలమీద పడేట్టు తన్నింది.

మిగిలిన పీతలు ఒక్కసారి మీద బడి తోపీని చావదన్ని వదిలిపెట్టాయి.' అని మా మేనమామ కథ పూర్తిచేశాడు.

మా మేనమామ నన్ను ఘోరంగా అవమానించడానికే ఈకథ చెప్పాడని నాకు అర్థం అయింది. దెబ్బకి దెబ్బతీయాలని నేను ఆలోచిస్తుండగా రోజూ నేనెక్కి తిరిగే సీతాకోకచిలుక ఒకసారి దగ్గి....

'నాక్కూడా కథలు చెప్పడం వొచ్చును. మీరు చెప్పినకథలు విన్నాక ఆ మాత్రం కథ నేను చెప్పలేనా అనిపించింది. మీరు వింటానంటే ఓ కథ చెబుతాను' అన్నది.

'నువ్వు మేమిద్దరం చెప్పిన కథలు విన్నావు కాబట్టి కృతజ్ఞతా భావంతో నువు చెప్పబోయే కథ కూడా మేం ఆలకిస్తాం. అయితే మేం చెప్పిన కథలు బాగున్నాయని గానీ, బావులేవని కానీ నువు చెప్పలేదు. కాబట్టి నువు చెప్పబోయే కథ మీద మా అభిప్రాయాన్ని మాత్రం చెప్పేది లేదు. ముందే తేల్చి చెప్పినందుకు ఏమీ అనుకోకు' అని మా మేనమామ అన్నాడు.

అంత వరకూ కిటికీ వూచల మీదున్న సీతాకోకచిలుక అక్కడ్నించి ఎగిరి మా యిద్దరికీ ఎదురుగా దీపస్తంభం మీద వాలి కథ చెప్పడం మొదలు పెట్టింది.

## చిలుకల కొండ కథ

'పూర్వం చిలుకల కొండ మీద మా సీతాకోక చిలుకలన్నీ హాయిగా జీవిస్తుండేవి. ఆ కొండ మీద మేమున్నాం కాబట్టి మేం దానికి చిలుకల కొండ పేరు పెట్టుకున్నాం. ఆ రోజుల్లో మా సీతాకోక చిలుకలకు అనేక మూఢ నమ్మకాలుండేవి. నేను అప్పుడే చదువు అదీ పూర్తి చేసే దశలో వున్నాను. నేనూ, నా సహ విద్యార్థులూ ఈ మూఢ నమ్మకాలకు దూరంగా వుండేవాళ్ళం. మా చదువు అయిపోయిన తరువాత మేం ఏం చేయాలన్న విషయం గురించి మాలో మేం చర్చించుకున్న దశలో మనం మూఢ నమ్మకాల్లేకుండా బతికినంత మాత్రాన ప్రయోజనం ఏముంది? మన చిలకల లోకంలోని మూఢనమ్మకాల్లో కొన్నిటినైనా నిర్మూలించడం ద్వారా మన జన్మను సాఫల్యమూ, చరితార్థమూ చేసుకుందాం.. అదే మన తక్షణ కర్తవ్యం, మరియు విద్యుక్త ధర్మం అని మేం నిర్ణయించుకున్నాం.

మా సీతాకోక చిలుకల మూఢ నమ్మకాల్లో అతి ప్రధానమైనది మా జన్మకు సంబంధించినది. గొంగళీ పురుగుల్లోంచి సీతాకోక చిలుకలు పుడతాయనే నమ్మకం అప్పట్లో ప్రబలంగా వుండేది.

అసలు గొంగళీ పురుగులనేవి లేనే లేవని, ఒక వేళ అవి వున్నా వాటికీ మన సీతాకోక చిలుకలకూ ఎలాంటి సంబంధమూ లేదనే సంగతి ముందు మేం ప్రచారం చేయడం మొదలు పెట్టేం.

కోతుల్లోంచి కోతులూ, చిలుకల్లోంచి చిలుకలూ, గబ్బిలాల్లోంచి గబ్బిలాలూ, తొండల్లోంచి తొండలూ పుట్టినట్టే సీతాకోక చిలుకల్లోంచి సీతాకోక చిలుకలే పుడతాయని, అది శాస్త్రం అనీ వివరించి, ఒకవేళ గొంగళీ పురుగులు అనేవి వుంటే వాటికి గొంగళి పురుగులే పుట్టాలనీ, అది కూడా శాస్త్రం అనీ మేం చెప్పి చూశాము.

మేం చెప్పిన దానిమీద నమ్మకం ఏర్పడకపోయినా మా మీదున్న గౌరవం కొద్దీ కొన్ని సీతాకోకచిలుకలు మా ప్రచారాన్ని నమ్మేయి. కొన్ని నమ్మలేదు.

నమ్మని వాటిలో కొన్ని కొంత చదువుకున్న సీతాకోక చిలుకలు కూడా వున్నాయి. అవి ఒకరోజు మా దగ్గిరకొచ్చి...

'మీరు చూడలేకపోయిందీ, మీరు చూసినా గుర్తించలేనిదీ లేనట్టే లెక్కబెట్టటం అవివేకం అని మీ పాఠ్య పుస్తకాల్లో చదువుకోలేదా? లోకం ఎంత పెద్దదో, ఎంత సంక్లిష్టమైనదో మీకు తెలుసుగా? గొంగళీ

పురుగులనేవి వున్నాయనీ, వాటిలోంచే సీతాకోక చిలుకలు పుడతాయనీ మన సీతాకోక చిలుకలకు తరతరాలుగా తెలుసు. మేమూ, బోడిగాళ్ళు మీరూ, చూడలేదు కాబట్టి, అవి మన దగ్గరకు వచ్చి కనిపించలేదు గాబట్టి అసలు గొంగళీ పురుగులనేవి లేనేలేవని మీరు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రచారం చేయడానికి మీకున్న ఆధారాలు ఏమిటి? ఈ అధికారం మీకు ఎవరిచ్చారు? అని చెరిగేశాయి.

'గొంగళీ పురుగులనేవి వుంటే, అవి వున్నాయని రుజువు చేసే బాధ్యత మీది కానీ మాది కాదు... ముందు అవి వున్నాయని రుజువు చేయండి.. చేసిన తరువాత, ఒకవేళ అవి నిజంగా వుంటే వాటిల్లోంచే సీతాకోక చిలుకలు పుడతాయని కూడా రుజువు చేయాలి. రుజువులు లేనిదే మా శాస్త్రవేత్తలు ఒప్పుకోరు...' అని మేం వాదించాం.

'అలాగైతే మాతో రండి.. మన చిలుకల కొండమీదే లోకాన్ని బాగా ఎరిగిన యితర ప్రాణులున్నాయి. వాటితో ముందు మాటాడదాం. వాటిలో చాలావరకు గొంగళీ పురుగుల్ని చూసే వుండవచ్చు'.. అని అవి మమ్మల్ని రమ్మన్నాయి.

సత్యం తెలుసుకోవడం మీదున్న జిజ్ఞాసకొద్దీ మేం వాటితో వెళ్ళాం. మాకు దగ్గరలోని ఒక రాళ్ళగుట్ట మీద ఒక ముసలి తొండ నివసిస్తున్నది. దాని దగ్గరకు మేం వెళ్ళి...

'ఓ తొండా! నువు చాలాకాలం నుంచీ జీవిస్తున్నావు. గనుక నీకు మా కంటే చాలా ఎక్కువ లోకజ్ఞానం వుంటుందని మా అభిప్రాయం. లోకంలోని యితర జీవులు ఏమేమి వున్నాయో నీవు మాకిపుడు చెప్పాలి' అని మేం అందరం కలిసే అడిగాము.

ఆ తొండ ఒక బస్కీ తీసి....

'తొండల కొండమీదున్న సమస్త ప్రాణుల గురించీ నాకు సర్వమూ తెలుసు. ఎక్కడ మొదలు పెట్టేది?' అని అడిగింది.

మేం ఒకసారి తికమకపడి 'తొండల కొండంటే ఏది? అది ఎక్కడున్నది' అని వినయంగానే అడిగాము.

'తొండల కొండంటే మీకు తెలియదా? ఆశ్చర్యంగా వున్నదే! ఏ కొండమీద మీరు పుట్టి, ఏ కొండ మీద జీవిస్తూ, ఏ కొండమీద యిప్పుడు యీ తొండతో మాటాడుతున్నారో అదే గదా తొండలకొండ....' అన్నదా తొండ.

"దీనిపేరు చిలుకల కొండగదా..మేం పుట్టక ముందునుంచీ మా పూర్వులు దీనిని చిలకల కొండే అన్నారు. గానీ తొండలకొండ అని ఎన్నడూ అనలేదు. నువ్విప్పుడు దీనికో కొత్త పేరు పెట్టేస్తున్నావు." అని మేం అభ్యంతరం చెప్పాము.

ఆ తొండ మరో రెండు బస్కీలు తీసి, 'ఈ కొండకు చిలకల కొండ అని మీ నలుగురు కలిసి పేరు పెట్టేస్తే సరిపోతుందా? ఈ కొండ మీద ప్రధానంగా రెండు రకాల ప్రాణులు నివసిస్తున్నాయి. తొండలూ, యితర ప్రాణులూ అని రెండు రకాల ప్రాణులు దీనిమీద వున్నప్పటికీ యిది తొండల కొండే అవుతుంది. కావాలంటే దీన్ని చిలకల కొండ అని మీలో మీరు పిల్చుకోండి. నాతో మాటాడేటప్పుడు మాత్రం మీరు దీన్ని తొండలకొండ అనే పిలవాలి. లేకపోతే నేను మీతో మాట్లాడను...'. అని ఆ తొండ భీష్మించుకున్నది.

దానితో మనకి పని వున్నప్పుడు మనం లౌక్యంగా వుండవలసిన అవసరం వున్నది గనుక మేం అలాగే అని. 'ఈ తొండల కొండమీద వున్న ప్రాణుల గురించి వివరంగా చెప్పు...' అని కోరాము.

'చెప్పడానికి పెద్దగా ఏమున్నది. సత్యం ఎప్పుడూ చాలా చిన్నగా, సూక్ష్మంగా వుంటుందని ముందు తెలుసుకోండి. ఈ తొండల కొండమీద తొండలు తినడానికి పనికొచ్చే ప్రాణులూ, తొండల్ని తినే ప్రాణులూ,

తొండలూ అనే మూడే రకాల ప్రాణులున్నాయి. ఆహారం దొరికే ప్రదేశాలు, దొరకని ప్రదేశాలు అని రెండే రెండు ప్రదేశాలున్నాయి. ఈ తొండల కొండ గురించి తెలుసుకో గలిగిన విషయాలన్నీ మీకు చెప్పేశాను. చివరగా యింకో విషయం కూడా మీకు తెలియజెప్పాలని నిర్ణయించుకున్నాను. మీరు తొండలు తినడానికి పనికొచ్చే ప్రాణులు...' అని చెప్పి ఆ దొంగ ముండా  తొండ గభాలన నా సహ ఉద్యమ కారులిద్దరిని పట్టేసుకుని తినేసింది.

ప్రమాదాన్ని పసిగట్టి మేం అందరం గాల్లోకి లేచిపోయి ప్రాణాలు దక్కించుకున్నాము.

తరువాత ఒక చింతచెట్టు మీద సమావేశం జరిపి, సత్యాన్వేషణలో అమర వీరులై పోయిన ఆ రెండు సీతాకోకచిలుకలకు శ్రద్ధాంజలి ఘటించి....

"జ్ఞాన సంపాదనగానీ, సత్యాన్వేషణగానీ ప్రమాదభరితం అనే విషయం మనకి తెలిసి వచ్చింది. ఇకనుంచీ మనం జాగ్రత్తగా వుందాము. ఆ పాపిష్టి తొండ స్వార్థ జీవే కాకుండా పరమ అజ్ఞాని కూడా. లోకంలో దానికి తిండి తప్ప మరొకటి వున్నట్టు తెలీదు. ఈ సంగతి దానికి ఎప్పుడో ఒకరోజు ఏదైనా ఒక పాము బోధించాలి గానీ మనలాంటి సాధు పుంగవులు దానికి బోధించలేరు" అని నిర్ణయించుకొని సీతాకోక చిలుకల జోలికి రాని ఒక నక్క దగ్గిరికి వెళ్ళాము.

అది మా ప్రశ్న విని కాసేపు ఆలోచించింది.

'అసలు జ్ఞానం అనేది రెండు అంచల్లో గానీ సిద్ధించదు. తమకు జ్ఞానాన్ని గానీ, సత్యాన్ని గానీ చెప్పగలిగిన జీవి ఎవరో గుర్తించడం మొదటి అంచె. మీరు ఆ పని సక్రమంగా చేసినందుకు నాకు సంతోషం కలిగింది. ఇక వినండి. లోకంలో ముఖ్యంగా పీతలున్నాయి. రకరకాల పిట్టలున్నాయి. పచ్చగడ్డి అనేదీ, దానిని తినడానికి వచ్చే కుందేలనేదీ కూడా వుంది. పాములనే ప్రమాదకరమైన ప్రాణులు కూడా ఈ లోకంలో కద్దు. వాటి జోలికి మాత్రం ఎన్నడూ పోకూడదు' అని చెపుతుంటే నేనే అడ్డుతగిలేను.

'జంతువులూ, పిట్టలూ సరే గొంగళి పురుగులనేవి వున్నాయా? ఆ సంగతి ముందు చెప్పు...' అని అడిగాము.

'మేం పురుగుల్ని తినం కాబట్టి వాటి సంగతి నాకు తెలియదు. మనకి పనికిరాని పరిజ్ఞానం దండగ కాబట్టి నేనెప్పుడూ పురుగుల్ని పట్టించుకోలేదు. మీకు పురుగుల్ని గురించి తెలుసుకోవాలని వుంటే లకుముకి పిట్టను అది పురుగుల్ని తింటుంది గదా అడగండి....' అన్నది నక్క.

'లకుముకిపిట్ట మా సీతాకోక చిలుకల్ని కూడా తింటుంది గదా.. దాని దగ్గరకు వెళ్తే మేం చచ్చి వూరుకుంటాం..' అన్నాను నేను భయంగా.

'అదీ నిజమే.. ఆ ప్రమాదం కూడా వుంది.. పురుగుల సంగతి, పురుగుల్ని తినేవారికీ, పురుగులు తినే ప్రాణులకూ మాత్రమే తెలుస్తుంది. కాబట్టి మీరు పురుగులు తినే ప్రాణులేమిటో కనిపెట్టి వాటినే అడగండి... ఇక వెళ్ళి రండి..' అనేసి ఆ నక్క ఒక కుందేలు కనిపిస్తే అటువైపు దూకింది.

పురుగులు ఏం తింటాయనే విషయం మీద మా సీతాకోక చిలుకల్లో చాలాసేపు చర్చ జరిగిన తరువాత.

చెట్లని అడిగితే తెలుస్తుందని తేలింది. వెంటనే దగ్గరున్న పూల చెట్టు దగ్గరకు పోయి గొంగళీల గురించి వాకబు చేశాము.

ఆ చెట్టు కాసేపు ఆలోచించి, 'మాకు తేనెటీగలు, సీతాకోక చిలుకలు, ములం పూతిక పిట్టలు మాత్రమే తెలుసు. గొంగళీల గురించి మాకు తెలిసే అవకాశం లేదు. మీరు ఒక పని చేయండి. పురుగులు తినడానికి పనికివచ్చే ఆకులున్న చెట్టు దగ్గరకు వెళ్ళి అడగండి...' అని పూల చెట్టు సలహా యిచ్చింది.

చివరికో మునగచెట్టు గొంగళీ పురుగుల గురించి తెలుసని చెప్పడమేగాక కాసేపు మీరు ఇక్కడ వుంటే దానిని చూపిస్తానన్నది.

ఓ తూనీగని పిలిచి గొంగళీ పురుగును రమ్మని దానితో కబురెట్టింది. కాసేపటిలో ఒక గొంగళీ పురుగు వచ్చింది. అది మమ్మల్ని చూసి....

'వికారపు రెక్కలతో, ఛెండాలమైన మచ్చలతో, చూస్తే డోకు వచ్చేట్టుగా వున్న వీళ్ళంతా ఎవరు దద్దా?" అని మునగ చెట్టు నడిగింది.

మేం కూడా అదే సమయానికి ఆ గొంగళీ పురుగుని చూశాము.

"నిగనిగలాగే నల్లని పెళుసు వెంట్రుకలతో, అలలు అలలుగా పాకుతూ వికారంగా, వికృతంగా, పరమ చీదరగా వున్న ఈ పురుగేనా గొంగళీ పురుగంటే..' అని నేను మునగచెట్టుని భయంగా అడిగాను

ఆ మునగచెట్టు మమ్మల్ని ఆ గొంగళీ పురుక్కూ, ఆ గొంగళీ పురుగును మాకూ పరిచయం చేసింది. అపుడు నేనే చొరవ తీసుకుని 'ఓ పురుగా... నువ్వసలు లేవని నేను ఈ క్షణం వరకు అనుకున్నాను. కానీ నువ్వు వున్నావని తేలింది! నువ్వు వుండడంవల్ల మాకేమీ నష్టం లేదనుకో.. అసలు సంగతి ఏమిటంటే గొంగళీ పురుగుల్లోంచి సీతాకోక చిలుకలు పుడతాయని మా వాళ్ళంతా మూర్ఖంగా నమ్ముతున్నారు. అది నిజం కాదని నిరూపించాలనే వుద్దేశ్యంతో మా యావన్మందీ లోకయాత్ర జరిపి నిన్ను కనుగొన్నాము. ఈ విషయం గురించి నీ అభిప్రాయం చెప్పు....' అన్నాను.

గొంగళీ పురుగు ముందు రెండు కాళ్ళూ ఎత్తి మాయందరి వైపూ చూసి...

'ఈ క్షణం వరకు నేను కూడా సీతాకోకచిలుకలనేవి లేనేలేవని అనుకుంటూ వచ్చాను. నిజానికి ఇవాళ పొద్దున్నే నాకూ, మా అన్నయ్యకీ ఈ విషయం మీద పెద్ద గొడవైపోయింది. మా అన్నయ్యకి మూఢ నమ్మకాలు ఎక్కువ. గొంగళీ పురుగులు చచ్చిపోయి దెయ్యాలై పోతాయనీ, ఆ దెయ్యాల్నే సీతాకోకచిలుక లంటారనీ వాడి నమ్మకం...' అని అది చెప్పింది.

ఆ గొంగళీ పురుగు మూఢ నమ్మకాల్ని ఖండిస్తూ మాట్లాడుతున్నందుకు నాకు చాలా ఆనందం కలిగింది.

'ఓ పురుగా... నువ్వు ఎంత వికారంగా వున్నావో, నీ అభిప్రాయాలూ, నీ జ్ఞానమూ, నీ శాస్త్రీయ దృక్పథమూ అంత మనోహరంగా, అంత హృద్యంగా వున్నాయి. ఈ రోజున మనం ఇలాగ కలుసుకోవడంవల్ల మన ఉభయ జాతులకీ మేలు చేకూరింది. గొంగళీ పురుగులు చచ్చి దెయ్యాలు కావడం, సీతాకోకచిలుకలు గొంగళీ పురుగుల్లోంచి పుట్టడం కేవలం మూఢ నమ్మకాలు. అనాదిగా వున్న నమ్మకం కాబట్టి వాటిని పోగొట్టడం కష్టమైన పనే. మనం యీ రోజున ఆ కష్టమైన పనిని నిర్వహించాము. తేలినదేమిటంటే గొంగళీ పురుగులు నిజం, సీతాకోక చిలుకలూ నిజం... ఆ మేరకు మన శాస్త్రీయ పరిజ్ఞానం పెరిగింది. రెంటి పుట్టుకకూ, చావుకీ ఎలాంటి సంబంధమూ లేదు.. ఈ విషయం ఈ రోజుతో తేలిపోయింది. ఒక మూఢ నమ్మకం దుంప నాశనం అయిపోయింది. ఆనాటి నుంచీ మా సీతాకోక చిలుకల్లో కొంత చైతన్యం విస్తరిల్లడం మొదలుపెట్టింది' అని ఆ సీతాకోక చిలుక తనకథ ముగించింది.

మా మేనమామ గంభీరంగా తల ఆడించి.....

'మూఢ నమ్మకాలు ప్రధానంగా రెండు రకాలు. లేనిది వున్నట్టు భ్రమపడటం ఒక రకం కాగా, వున్నదాన్ని కంటికి కనిపించేదాన్ని లేదనుకోవడం రెండో రకం. నువు చెప్పిన కథ మొదటి రకం మూఢ నమ్మకానికి సంబంధించినది. రెండో రకం మూఢ నమ్మకానికి మా మేనల్లుడే నిదర్శనం' అన్నాడు.

నేను వులిక్కిపడ్డాను. 'మధ్యలో నా ప్రస్తావన ఎందుకు' అని కంగారుగా అడిగాను.

'ఎందుకంటే నువు అనేక సంవత్సరాలు అసలు దెయ్యాలు లేవని వాదించావు. దెయ్యపు పుటక పుట్టి కూడా నువు దెయ్యాలు లేవని నమ్ముతున్నావంటే అది మూఢ నమ్మకం అవుతుందా? లేదా?'

'నువు దేన్నయితే మూఢ నమ్మకం అంటున్నావో నేను దానినే జ్ఞానం అనుకుంటున్నాను. నీ మూఢ నమ్మకాలు నీకు వుండొచ్చు.... నా మూఢ నమ్మకాలు నాకుంటే నీకు నష్టమేమిటి?' అని నేను నిలదీసి అడిగాను.

'నువ్వే కాదు.. ఈ లోకంలో ఎవరూ కూడా మూఢ నమ్మకాలు కలిగి వుండటానికి వీలులేదు. నేనొప్పుకోనంతే! మూఢ నమ్మకాల వల్లే లోక ప్రగతికి ఎంతో ఆటంకం కలిగింది. మూఢ నమ్మకాలు ఎంత అనర్ధదాయకమో తెలియజేయడానికి ఒక కథ చెబుతాను విను' అని మా మేనమామ ఈ కథ చెప్పేడు.

## వెర్రిమిడతల కథ

పూర్వం పాపికొండల ప్రాంతాల్లో నీలి మిడతలు నివసిస్తుండేవి. వాటికి అనేక మూఢ నమ్మకాలుండేవి. కాకులూ, గోరలూ, పోలుగు పిట్టలూ అనే పిట్టలు లేనే లేవనీ, వాటి ఉనికిని గురించి జరిగిన ప్రచారాలన్నీ కట్టుకథలనీ అవి గట్టిగా నమ్ముతుండేవి. ఏ గోరపిట్టో వచ్చి ఒకటో రెండో మిడతల్ని ఎత్తుకుపోయినట్టు ఏ మిడత అయినా చెబితే అవి ఆ మిడతని మానసిక చికిత్సాలయానికి పంపించేవి, చిత్త భ్రమను కుదర్చడానికి వైద్యం చేయించేవి.

అలాగే వాటికి కష్టిస్తే, ఫలితం దక్కుతుందనీ, ఇతరుల సొమ్ము తాకరాదనీ, ధర్మం జయిస్తుందనీ, సత్యం కలకాలం నిలుస్తుందనీ రకరకాల మూఢ నమ్మకాలుండేవి. ఇతరుల్ని హింసించరాదనే మూఢ నమ్మకం వాటికి ప్రబలంగా వుండేది.

చాలాకాలంపాటు అవి తమ మూఢ నమ్మకాలవల్ల బాధలు పడుతూ బతికాయి. గోరలూ, మైన గోరలు, కౌజు పిట్టలూ ఇంకా అనేక రకాల పిట్టలు వచ్చి మిడతల్ని తినేస్తూండేవి. కళ్ళారా ఈ సంగతి చూసినా, చెబితే పిచ్చాసుపత్రికి పంపిస్తారని మిడతలు ఆ సంగతి చెప్పేవి కావు. పైగా పిట్టలు అనేవి లేనే లేవని, మిడతలన్నీ ఉపన్యాసాలు చెబుతూ, పుస్తకాలూ అవీ రాసేవి.

మరికొంతకాలం అయిపోయిన తరువాత, ఒక తెలివైన మిడత భౌతిక విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేసి, పిట్టలు అనేవి వున్నాయనీ, వుండటమే కాకుండా అవి మిడతల్ని తిని తెగ బలుస్తున్నాయని కూడా అది శాస్త్రీయంగా, భౌతికంగా నిరూపించింది.

అంతేకాకుండా కష్టేఫలి అన్న మూఢ నమ్మకంలో కొంత వాస్తవం వున్నాదనీ, మనం కష్టపడి బాగా తిని, బాగా ఆరోగ్యంగా వుంటే పిట్టల వేట ఫలిస్తుందనీ, కష్టేఫలి అంటే అసలు అర్థం అదేనని కూడా చెప్పింది. అక్కడితో ఆగకుండా

లోకంలో ధర్మం జయించదనీ, బలమే జయిస్తుందనీ, అహింస పరమధర్మం అనే మాట నిజమే అయినప్పటికీ లోకంలో చాలా హింస వుందనీ అది తెలియచెప్పింది.

దానితో కొన్ని మిడతల్లో పాత మూఢ నమ్మకాల స్థానంలో కొత్త మూఢ నమ్మకాలు వెలిశాయి. మరికొన్ని మిడతలు పాత నమ్మకాలు వదులుకోకుండా, కొత్త మూఢ నమ్మకాల్ని కూడా స్వీకరించాయి. పిట్టలు అబద్ధం కానీ అవి మిడతల్ని తినడం మాత్రం నిజం. కష్టేఫలి అనేది నిజం, కానీ అది ఇతరులకే ఫలించడం కూడా నిజం. ధర్మం జయించడం నిజం, జబర్దస్తీ, జబ్బ సత్తువా జయించడం నిజం. అనగా జబర్దస్తీయే ధర్మం

అనేది కొత్త నిజం. ఇలా అని కొత్త కొత్త సిద్ధాంతాలు రూపొందించుకొని, వెనుకటిలాగ బతుకుతుంటే తెలివైన మిడత వూరుకోలేదు.

"ఆయుధం ద్వారా రాజ్యాధికారం వస్తుందనీ, రాజ్యాధికారం సంపాదించడం ధర్మ సంస్థాపన అనీ అది కొత్త నినాదం తయారుచేసి మిడతలన్నింటికీ సమీకరించింది.

అవన్నీ దుడ్డు కర్రలు పట్టుకొని, కొండమీద మిగిలిన ప్రాణుల మీదికి దాడి చేశాయి. ముఖ్యంగా మిడతల్ని తినేసే పిట్టలమీద అవి కేంద్రీకరించాయి.

ఆయుధం ద్వారానే అధికారం వస్తుంది అనే నినాదాలు చేసుకుంటూ అవి దాడి చేస్తుంటే, గోరపిట్టలన్నీ దండుగా తయారై –

'ఆయుధం ద్వారానే రాజ్యాధికారం రావడం నిజమే కానీ, ఆ ఆయుధాలు మా దగ్గిరున్నాయి. మీ దగ్గరున్న దుడ్డు కర్రలు మీ దేహంలోని భాగం కాదు. మాకు ముక్కులున్నాయి. మాకు కాలిగోర్ల కత్తులున్నాయి. ఈ ఆయుధాల ముందు మీ ఆయుధాలు బలాదూర్. మిమ్మల్ని ఇలాంటి వెర్రి పనికి పంపిన మూర్ఖుణ్ణి ముందు తినేసి తరువాత మిగిలిన వాటి సంగతి చూస్తాం అని తెలివైన మిడతని ముందు పట్టుకున్నాయి. పట్టుకొని...

"ఆయుధం ద్వారానే పెత్తనం వస్తుందన్న సంగతి నీ కంటే మాకు ముందు తెలుసు. అందుకే మేం పుడుతూనే ఆయుధాలతో సహా పుట్టేం. మిడత పుటక పుట్టినా నీవు ఆయుధ ప్రాశస్త్యాన్ని గమనించేవు. కాబట్టి మోక్షానికి అర్హత సంపాదించుకున్నావు. నీకుమోక్షం ప్రాప్తించుగాక!' అని ఆశీర్వదించి ఒక గోర ఆ మిడతని భోంచేసింది. కాసేపట్లో మిగిలిన మిడతలన్నీ గోరలపాలై అంతరించిపోయాయి. ముందు గోరలు లేవనే మూఢ నమ్మకంవల్ల నష్టపోతే, తర్వాత అవి గోరల్ని జయించవచ్చనే మూఢ నమ్మకంవల్ల నష్టపోయాయి. అక్కడా ఇక్కడ మూఢ నమ్మకం వల్లనే అవి నాశనం అయిపోయాయి. మా మేనమామ చెప్పినకథ విన్నాక నాకు చాలా చిరాకేసింది.

"నువ్వు ఆ మిడతలన్నీ నాశనం అయిపోయినందుకు సంతోషంగా వున్నట్టు నాకు అనిపిస్తున్నది. వాటిని చూసి జాలి పడాలి కదా? కనికరం కలగాలి గదా? ఆ గోర పిట్టల్ని అసహ్యించుకోవాలి గదా? నువు చెప్పిన కథ వింటే ఆ భావాలు కలగడం లేదు. ఇదేమి న్యాయం? అని నేను ధిక్కారంగా అడిగాను.

మా మేనమామ నా గుండు మీద ప్రేమగా నిమిరాడు.

"నువు నా మేనల్లుడివి. నీ దగ్గర కూడా నన్ను నటించమంటావా? ఇదే కథ ఇతరుల కోసం చెప్తాననుకో... అప్పుడు నువ్వు అడిగినవన్నీ సమపాళ్ళలో వేసి మరీ చెబుతాను అయితే ముందు నాకొక వాగ్దానం చేయాలి.. ఒట్టేయాలి.... అప్పుడే నీ ప్రశ్నకు సమాధానం చెబుతాను.."

"చెప్పు.. నువు కోరింది నేను కాదనే ప్రసక్తి ఎలా వస్తుంది.... నువు గీచిన గీత దాటనని ఆంజనేయస్వామివారి మీద ప్రమాణం చేస్తున్నాను' అన్నాన్నేను.

"ఏమీ లేదు.. నువ్వు అడిగిన ప్రశ్నని పరిశీలించిన తర్వాత నువ్వు యింకా బాల్య దశలోనే వున్నావని నాకు అర్థం అయిపోయింది. ఇంత చిన్న వయసులోనే నీవు నీ ఆత్మకథ రాయడం ధర్మం కాదు. మరి కొంత పెద్దయిన తర్వాత లోకం గురించీ, నీ గురించీ, మన దెయ్యం జాతి గురించీ మరికొంత అర్థమైన తర్వాత నీ ఆత్మకథ రాయి... అంతవరకు రాయవద్దు" అన్నాడు మా మేనమామ.

నేను చేతిలో చెయ్యి వేశాను. "ఆంజనేయస్వామి వారి మీద ప్రమాణం చేసిన తరువాత మాట తప్పనులే.. ఆత్మకథ ఆపేస్తాను.. ముందు నేను అడిగిన దానికి సమాధానం చెప్పు. నాకు యింకా వయసు రాలేదని ఎందుకన్నావ్?"

మా మేనమామ నా గుండు మీద ప్రేమగా ముద్దు పెట్టుకుని...

"మిడతల్ని చూసి జాలి కలగలేదా అని అడిగావు? నిజమే. నాకు జాలి కలగలేదు. అసలు మనకు జాలిపడవలసిన దగ్గర జాలీ, ప్రేమ కలగవలసిన దగ్గర ప్రేమా, అసహ్యం కలగవలసిన దగ్గర అసహ్యమూ, ఆగ్రహం రావాల్సిన దగ్గర ఆగ్రహమూ నిజంగా కలుగుతున్నాయా? కలిగినట్టు మనం నటిస్తున్నామా? అని ప్రశ్నించుకుంటే సమాధానం నీకే తెలుస్తుంది. ముందు ఈ కథ విను.. అని గదంతా కలియచూశాడు. సీతాకోకచిలుక కథ వినడానికి వుత్సాహం చూపుతూ రెక్కలు ఆడించింది.

"ఓ సీతాకోక చిలుకా! నేను మా మేనల్లుడితో, యింకెవరూ వినడానికి వీలులేని విషయాలు కొన్ని చెప్పాల్సి వుంది. అందువల్ల పరాయి వాళ్ళెవరూ యిక్కడ వుండటానికి వీలులేదు. నువు బైటకి వెళ్ళి ఆడుకో" అని సీతాకోక చిలుకను బైటకి పంపేసి ఈ కథ మొదలుపెట్టాడు మా మేనమామ.

## చివరాఖరి కథ

'పూర్వం నువు పుట్టడానికి ముందు మన దెయ్యాలకు ఓ జుత్తు దెయ్యం రాజుగా వుండేది. అది చాలా  కఠినంగా, కర్కశంగా వుండేది. మనదేశంలోని దెయ్యాల ఆస్తులన్నీ అది కాజేసేది. తనకు కావాల్సిన ఆడ దెయ్యాన్ని బలవంతంగా ఎత్తుకెళ్ళిపోయి తన యింట్లోనే వుంచేసుకునేది. అందులో కొన్నింటికి వ్యభిచారంలోకి దింపి, ఆ డబ్బులన్ని తన ఖజానాలో పడేసుకునేది. పరాయిదేశాల నుంచి మత్తు మందులు, మాదక ద్రవ్యాలు దిగుమతి చేయించి దెయ్యాలకు బలవంతంగా అమ్మేది. ఎవరైనా తన మాటకు ఎదురు తిరిగితే చంపించేసేది.

దాని ఆకృత్యాలకు మన దెయ్యాలన్నీ హాహాకారాలు చేసేవి.

రాజు దుష్టుడనీ, దుర్మార్గుడనీ, అవినీతిపరుడనీ, దెయ్యాలన్నింటికీ శత్రువనీ, దెయ్యాలకే అవమానకరమైన దెయ్యమనీ దెయ్యాలన్నీ చెప్పుకుంటుండేవి.

నాకూ, మా మేనమామ కొడుక్కీ మాత్రం రాజుని చూస్తే అసూయగా వుండేది. వాడి వైభవానికి ఈర్ష్య కలిగేది.

సుఖ సంతోషాలూ, ఐశ్వర్యాలూ, భోగ భాగ్యాలూ మాకూ కావాలి. మాకూ అవన్నీ కావాలంటే వాడు చేసిన పనులన్నీ మేమూ చేయాలి.

మా ధ్యేయమూ అదే కాబట్టి వాడ్ని గురువుగా ఎంచుకోవాలి తప్పించి, వాడ్ని అసహ్యించు కోవాల్సిన పనేమున్నది?

ఈ రీతిగా ఆలోచించి మేము రహస్యంగా రాజుని అభిమానిస్తూ, బైటకి అందరితోపాటు బండబూతులు తిడుతూ వుండేవాళ్ళం. రాజు వీధిలో దర్పంగా, బల్లిమీద ఊరేగుతుంటే అతని దృష్టిలో పడటం కోసం చాలా మంది పడే యాతనలు చూసి మేం లోలోపలే నవ్వుకునే వాళ్ళం. రాజు అంత దూరం వెళ్ళిపోయిన వెంటనే వాళ్ళే బండబూతులు తిడుతుంటే యింకా నవ్వొచ్చేది నాకు.

'ఈ అన్యాయపాలన అంతం కావాలి' అని మా బావ ఒక రోజు ఒక నినాదం చేశాడు.

ఇంత లంచగొండితనమా?

ఇంత ఆశ్రిత పక్షపాతమా?

ఇంత దుర్మార్గమా?

ఇంత అవినీతి పాలనా?

ఇంత నీతిమాలిన సంపాదనా?

ఇంత సిగ్గుమాలిన పాలనా?

ఇంత పరపీడనా పరాయణత్వమా?

అని వాడు హుంకరించాడు.

మిగిలిన దయ్యాలు కూడా మా బావతో గొంతు కలిపాయి. "మనం రాజుని దించెయ్యాలి. వాడు పోతే తప్ప మనకి విముక్తిలేదు" అని ఆ బావ మరో నినాదం యిచ్చాడు.

మిగిలిన దెయ్యాలన్నీ అంతే! అంతే! అని వంతపాడాయి. కొద్ది రోజుల్లోనే మా బావ మిగిలిన దెయ్యాలకు ఆరాధ్య దైవం అయిపోయాడు.

ఆ రాత్రి నేనడిగాను 'బావా! రాజుగారి పాలన అంత అన్యాయంగా వుందని నిజంగానే భావిస్తున్నావా?'

'వాడి పాలన అన్యాయంగా వుందని కంచు కంఠంతో చెప్పకపోతే నేను అధికారంలోకి రావడం ఎలాగ? నేను రాజు కావాలి అంటే వాడు పోవాలి. వాడు పోవడానికి నేను రాజు కావడానికి ఈ జనం అవసరం చాల వున్నది. నువు చచ్చు ప్రశ్నలు వెయ్యకుండా నాకు తోడుగా వుండు' అనేసి మా బావ కసురుకున్నాడు.

వారం పది రోజుల్లో మిగిలిన దెయ్యాలన్నీ మా బావ నాయకత్వంలో ఒకటై పోయాయి. జుత్తు పట్టుకొని ఆ రాజుని కిందికి ఈడ్చేసి, మా బావ గుండుకి సంపెంగ నూనె రాసి సింహాసనం మీద కూర్చోబెట్టాయి. మా బావ రాజు అయిన వెంటనే నేను మా చెల్లెల్ని వాడికిచ్చి పెళ్ళి చేశాను.

మా బావ రాజ్యంలో దెయ్యాలన్నీ ఇదివరకు లాగే సుఖంగా బతుకుతున్నాయి. మేం కోరుకున్న రీతిలో సుఖ సంతోషాలూ, భోగ భాగ్యాలూ మాకు దక్కినాయి. వెనుకటి రాజు చేసిన పొరపాటు మేం చేయకుండా రాజ్యంలో ఎవడైనా "అన్యాయం" అనే సంగతి మాట్లాడితే వాడ్ని జాగ్రత్తగా చూసుకున్నాము. వాడికి కావాల్సింది ఇస్తున్నాము.

ఆగ్రహం అంటే అసూయ అనీ, అసహ్యం అంటే భయమనీ, భయం అంటే ప్రాణం మీద తీపి అనీ మేం కనిబెట్టి హాయిగా బతుకుతున్నాం.

మా బావకి నువు ఒక్కడివే కొడుకువి. వాడి తర్వాత రాజ్యం నీకే దక్కుతుంది. కాబట్టి నువు ఇందులోని సారస్యాన్ని గ్రహించు.

మిడతల్ని చూసి జాలిపడితే మనం ఎప్పటికీ ఈ స్థితిలో కొనసాగలేము మనం ఆ గువ్వ పిట్టల్ని చూసి అసూయ పడాలి. అయితే ఆ సంగతి బైట పడకుండా మిడతల మీద జాలి పడినట్టు నటించాలి. ఇలా నటించడం వల్ల తోటి వాళ్ళ దగ్గర మన పరపతి పెరుగుతుంది. ఈ సంగతి గుర్తెరిగి నువు జాగ్రత్తగా మసలుకో. ఇన్నాళ్ళు చిల్లర దెయ్యంలాగ రికామీగా తిరిగావు గానీ యిక నుంచీ బాధ్యతగా ఆలోచించడం నేర్చుకో. ఆత్మకథ రాయడం మాత్రం తక్షణం ఆపీ. ముందు జీవితంలోని సత్యాసత్యాల్ని గ్రహించు. దాని కోసం కథలు వింటేనూ, కథలు చెబితేనూ ప్రయోజనం లేదు' అని మా మామయ్య ముగించాడు.

మా మావయ్య ఉపన్యాసాన్ని గురించి ఆలోచిస్తూ ఆత్మకథ రాస్తున్న పుస్తకాన్ని కిటికీ లోనుంచి బైటకి విసిరేశాను.

***తొలి ప్రచురణ: ఆంధ్రజ్యోతి, దినపత్రిక, ఆదివారం అనుబంధం, 1992***